

ఎండ పోట్లు

బాబోయ్.. ఇవేం ఎండలు!

- ఉక్కపోత, వేడి వాతావరణం
- వేడిగాలులతో ఉక్కిరిబిక్కిరి
- వర్షాకాలంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యం
- కొందరికి అనారోగ్య పరిస్థితులు



కాకినాడ నగరంలో ఎండ తీవ్రత కారణంగా గొడుగు వేసుకుని వెళుతున్న యువతులు

ఇది వర్షాకాలమా! మండు వేసవిలో ఉన్నామా! ప్రస్తుత వాతావరణం పరిస్థితి చూస్తే అందరికీ అదే అనుమానం కలుగుతోంది. వర్షాలు కురవాల్సిన సమయంలో వేసవిని తలపించే రీతిలో కాస్తున్న ఎండలు, వీస్తున్న వేడిగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

పిఠాపురం/ రాజమహేంద్రవరం సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడి అందరూ సేదతీరారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత అప్పుడప్పుడు పడిన వర్షాలు, రుతుపవనాల ప్రభావం అంతంతమాత్రంగానే ఉండి ఎండలు తీవ్రంగా కాస్తుండడంతో ఇప్పుడు వేసవికాలం అన్నట్టుగా మారిపోయింది వాతావరణం. గత నాలుగైదు రోజులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటలకే వేడిగాలులు ప్రారంభమై, సాయంత్రం వరకు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపైకి వచ్చేందుకు సాహసించట్లేదు. మధ్యాహ్నం పూట రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. బైక్‌లపై కూడా బయట తిరగలేని పరిస్థితి. టోపీలు పెట్టుకున్నా, కూలింగ్ గ్లాస్‌లు ధరించినా మాస్క్‌లు పెట్టుకున్నా సరే ఎండదెబ్బకు హడలిపోయారు. ఉపశమనం కోసం శీతలపానీయాలు వైపు పరుగులు పెడుతున్నారు. ఈ వాతావరణంతో మరోపక్క తలపోటు, జ్వరాలు వచ్చి జనం ఇబ్బందులు పడుతున్నారు. అటు సాయంత్రం నుంచి రాత్రి వరకు ఒకటే ఉక్కపోత. ఆపై వేడి తగ్గకపోవడంతో వృద్ధులు, చిన్నారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పిఠాపురం, కాకినాడ, తుని, పెద్దాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, ఏలేశ్వరం, జగ్గంపేట తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 37-39 డిగ్రీల మధ్య ఉంటున్నాయి. అమలాపురం, రాజమహేంద్రవరంలలో కూడా ఇదే పరిస్థితి. అయితే 41-43 డిగ్రీలు ఉన్న ఫీలింగ్ ఉంటుందని వాతావరణశాఖ చెప్తోంది. రుతుపవనాల ప్రభావం అంతగా లేకపోవడం, బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో వేడిగాలులు వీస్తున్నట్టు చెప్తున్నారు. బుధవారం ఇదే పరిస్థితి ఉండగా, గురువారం నుంచి అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెప్పడం ఒక్కటే కొంత ఉపశమనంగా ఉంది.

'నీరి' తేరేనా..



గోదావరి కాల్వలోకి చెత్త డంపింగ్ (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో కాలుష్య కాసారాలుగా మారిపోయిన గోదావరి కాలువలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఎక్కడికక్కడ కోళ్లు, రొయ్యలతోపాటు నివాస, వాణిజ్య, పారిశ్రామిక వ్యర్థాలన్నీ యథేచ్ఛగా కాలువల్లో కలిసిపోవడంతో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈనేపథ్యంలో సమస్య పరిష్కరించడానికి రంగంలోకి దిగింది. కాలువలు ఎక్కడెక్కడ ఏవిధంగా కాలుష్యం అవుతున్నాయో గుర్తించాలని నిర్ణయించింది. ఈమేరకు సమగ్రంగా అధ్యయనం చేయించేందుకు సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (నీరి)కి బాధ్యతలు అప్పగించింది. త్వరలో ఈ సంస్థ నిపుణులు గోదావరి కాలువలపై అధ్యయనం చేయనున్నారు.

- ఉమ్మడి జిల్లాలో గోదావరి పంట కాలువల కాలుష్యంపై ప్రభుత్వం దృష్టి
- కాలువల నిండా తీవ్రంగా వ్యర్థాలు పెరగడంతో అన్నదాతల ఇబ్బందులు
- వందలాది గ్రామాల్లోని ప్రజల తాగునీటి అవసరాలకు ఈ నీళ్లే దిక్కు
- సమస్య మూలాలపై అధ్యయన బాధ్యతలు కేంద్ర ప్రభుత్వం సంస్థకు అప్పగింత
- గోదావరి కాలువల్లో ఇనిస్టిట్యూట్ నిపుణుల అధ్యయనం : 4 నెలల్లో నివేదిక
- అటు కాలువల్లో కోళ్లు, రొయ్యలు తదితర వ్యర్థాలన్నీ యథేచ్ఛగా పారబోత
- అనేక పరిశ్రమల వ్యర్థా కాలుష్య జలాలూ కాలువల్లోకే మళ్లింపు
- 'మిషన్ క్లీన్ గోదావరి' అంటూ వైసీపీ ప్రభుత్వం హడావుడి.. పనులు నిల్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ప్రధాన కాలువలు తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో 2,400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. మధ్య డెల్టా కింద కోనసీమ, తూర్పు డెల్టా కింద ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు కాలువలు, డ్రైన్ల ద్వారా గోదావరి నీరు ప్రవహిస్తోంది. ఈ నీళ్లు లక్షల ఎకరాల పంటసాగుతోపాటు తాగునీటికి కూడా ఆధారం. ఈ నేపథ్యంలో వీటిని ఎక్కడికక్కడ సురక్షితంగా ఉంచితేనే ఆ నీళ్లు తాగే ప్రజల ఆరోగ్యానికి ధీమా. కానీ దీనికి విరుద్ధంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గోదావరి కాలువలు కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. అనేకమంది ఇళ్లల్లో ఉండే చెత్తాచెదారం అంతా తెచ్చి ఈ కాలువల్లోనే పారబోస్తున్నారు. గృహనిర్మాణ వ్యర్థాలు, చికెన్, చేపలు, రొయ్యల వ్యర్థాలు, మద్యం దుకాణాల మొదలు క్షవరశాలలు, వందలాది వాణిజ్య దుకాణాల్లో వాడిపడేసిన వస్తువులను కాలువల్లోకి వదిలేస్తున్నారు. ఇది కాకుండా కడియం నుంచి కాకినాడ వరకు, ఆత్రేయపురం నుంచి అమలాపురం వరకు కాలువలకు సమీపంలో వందలాది కోళ్లఫారాలున్నాయి. వీటిల్లోని వందల టన్నుల వ్యర్థాలను డ్రమ్ముల్లో తెచ్చి డంపింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా అనపర్తి, కడియం, బిక్కవోలు, ద్వారపూడి, సామర్లకోట, కాకినాడ, కోనసీమ పరిధిలోని కాలువల్లో ఈ తరహా వ్యర్థాలు భయంకరంగా కలిపేస్తున్నారు. కోనసీమ పరిధిలో రొయ్యల చెరువుల్లో వాడిన నీటిని పైపులతో గోదావరి కాలువలకు మళ్లిస్తున్నారు. అటు తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని నిడదవోలు, కొవ్వూరు తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. ఇందులో అనేకరకాల హానికారక రసాయనాలు కలిసి ఉంటాయని తెలిసినా లెక్కచేయడం లేదు. ఇలా ఎక్కడికక్కడ కాలువలు విషమయం అవుతుండగా, ఆ నీటిని తాగే మూగజీవాలు తరచూ మృత్యువాత పడుతున్నాయి. అలాగే పంచాయతీల పరిధిలోని మురుగుకాలువల నీటినీ కాలువల్లోకే తరలిస్తున్నారు. అలాగే రాజమహేంద్రవరం నుంచి సామర్లకోట వరకు కాలువలకు సమీపంలో అనేక రకాల పరిశ్రమలున్నాయి. వీటిలో వినియోగించగా వచ్చే కాలుష్య జలాలను శుద్ధిచేసి భూమిలోకి వెళ్లేలా చేయాలి. కానీ ఖర్చు సాకుతో గుట్టుగా పైపుల్లోంచి గోదావరి కాలువల్లోకి కలిపేస్తున్నారు. ఈనేపథ్యంలో గత వైసీపీ సర్కారు 'మిషన్ క్లీన్ గోదావరి' పేరుతో ప్రత్యేక ప్రాజెక్టును 2019 సెప్టెంబరులో ప్రారంభించింది. సీఎం చైర్మన్‌గా వ్యవహరించే ప్రాజెక్టు కింద రూ.100 కోట్లతో పనులు చేస్తామని గొప్పలు చెప్పింది. తీరా అయిదేళ్లలో కాలుష్య నివారణకు పైసా ఖర్చు చేయలేదు. ఈ నేపథ్యంలో తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో 175 చోట్ల గోదావరి కాలువల్లో నీళ్లు విషతుల్యంగా మారినట్టు నీటిపారుదలశాఖ రెండేళ్ల కిందట గుర్తించింది. కాలువల వెంబడి వ్యర్థాలపై డ్రోన్లతో పంచాయతీలు, మున్సిపాల్టీలు సర్వే చేసింది. అత్యధికంగా కోనసీమలో కోళ్లు, రొయ్యల వ్యర్థాలు, కడియం, ద్వారపూడి, అనపర్తి, బిక్కవోలు, సామర్లకోట పరిధిలో 68 చోట్ల కాలువలు నీళ్లు వ్యర్థాలతో విషపూరితంగా మారినట్టు నిర్ధారించారు. కొన్నిచోట్ల పరిశ్రమల నుంచి కాలుష్య జలాలు నేరుగా కలిసిపోతున్నట్టు తేల్చారు. ఇవన్నీ పంటపొలాలకు చేరడంతో పంటలు నష్టపోవడం, అటు భూగర్భ జలాలు సైతం కలుషితం అయినట్టు ఆయాశాఖలు తేల్చాయి. కానీ అప్పటి ప్రభుత్వం పైసా కూడా ఇవ్వకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టిసారించింది. కాలువల్లో ఎక్కడెకక్కడ కాలుష్యం కలుస్తోంది? ఆయా జల కాలుష్యంతో ఎంతెంత హానికర రసాయనాలున్నాయి? తద్వారా వచ్చే సమస్యలేంటి? అనే దానిపై అధ్యయనం చేయించాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మన్ కొన్ని రోజుల కిందట జిల్లాలో కాలువలను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం చర్చించగా, సమగ్రంగా అధ్యయనం చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(నీరి)కి అప్పగించాలని నిర్ణయించారు. త్వరలో నీరి అధ్యయనం చేసి పరిష్కారం సూచిస్తూ నాలుగు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందించనుంది.



అనపర్తిలో గోదావరి కాల్వ వెంబడి చెత్త

బలభద్రపురంపైనా..

బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు కలకలం రేపిన విషయం తెలిసిందే. గ్రామంలో 62 క్యాన్సర్ కేసులున్నట్టు కాకినాడ రంగరాయ వైద్య కళాశాల అధ్యయనంలో తేలింది. ఒకే తరహా కాకుండా పలు రకాల క్యాన్సర్ కేసులు ఇక్కడే రావడానికి ఏయే కాలుష్య కారకాలు కారణం అనేది అధ్యయనం చేసి తేల్చే బాధ్యతను ప్రభుత్వం 'నీరి'కి అప్పగించింది. ఇందుకు రూ.50లక్షల వరకు ఖర్చవుతుండగా, పీసీబీ తరఫున ఖర్చులు భరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో నిపుణులు అధ్యయనం ప్రారంభించనున్నారు. మరోవైపు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సైతం త్వరలో ఇక్కడ క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టనుంది.

సాగునీటి సమస్యపై కదలిక



గుర్రపుడెక్క తొలగించిన తరువాత నీరు పారుతున్న చిందాడగరువు కెనాల్

- స్పందించిన జలవనరులశాఖ
- చిందాడగరువు చానల్‌లో గుర్రపు డెక్క తొలగింపు.. సాగునీరు విడుదల
- సాగునీటి ఎద్దడి కథనంపై టీడీపీ కార్యాలయం ఆరా
- పార్టీ నేతల నుంచి నివేదిక కోరిన మంత్రి లోకేశ్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

'ఇటు నీరు.. అటు బీడు' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనంపై జలవనరులశాఖ అధికారులు స్పందించారు. టీడీపీ కార్యాలయం కూడా కోనసీమలో సాగునీటి సమస్య ఉత్పన్నమైన తీరుపై కీలక నాయకులనుంచి సమాచారం సేకరించింది. రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ కార్యాలయం సాగునీటి ఎద్దడి సమస్యపై పార్టీ నాయకుల నుంచి నివేదిక కోరింది. జిల్లావ్యాప్తంగా సాగునీటి సరఫరాలో జలవనరులశాఖ అధికారులు ఘోర వైఫల్యం చెందారనే ఆరోపణలు రైతు సంఘాల నుంచి వినిపిస్తోంది. గోదావరిలో లక్షల క్యూసెక్కుల వరదనీరు వృథాగా సముద్ర జలాల్లో కలుస్తున్నా కోనసీమ జిల్లాలోని ప్రధాన, వాటి అనుబంధంగా ఉన్న పంటకాల్వలు, బోదెలకు సాగునీరు అందక ఖరీఫ్ సేద్యం చేయడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం అమలాపురం రూరల్ మండలం చిందాడగరువు చానల్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను బుధవారం తొలగించే ప్రక్రియ చేపట్టారు. కాల్వకు నీటిమట్టం విడుదల చేసినా పూర్తిస్థాయిలో నీరు మాత్రం చిందాడగరువు, గూడాల, దబ్బందుల వంటి వివిధ కాల్వలకు ఇంకా నీరందని పరిస్థితి నెలకొంది. అల్లవరం మండలంలోని బెండా కెనాల్‌పై శివారు ప్రాంతాల భూములకు సాగునీరు అందించే విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం చిందాడగురువు చానల్ పరిధిలో ఉన్న ఆయకట్టు భూములకు సాగునీరు అందించే పనిలో జలవనరులశాఖ అధికారులు ఉన్నారు. ఐ.పోలవరం మండలంలోని మురమళ్ల, టి.కొత్తపల్లి, గుత్తెనదీవి, ఎర్రగరువు, జి.మూలపొలం ప్రాంతాల్లో నీరందక ఎండిపోతున్న భూములను తహశీల్దార్ విజయశ్రీ, వ్యవసాయాధికారి వాణి, ఇరిగేషన్ ఏఈ ఈశ్వరరావులతో కూడిన బృందం పరిశీలించి అక్కడ పరిస్థితులను అంచనావేసింది. ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉంటే ముందుగానే చెప్పండి. మేమంతా క్రాప్ హాలీడే ప్రకటించి సేద్యం చేయడం మానేస్తాం. ఇప్పటికే నారుమడులు, నాట్లువేసి నీరు లేకపోవడంవల్ల ఎండిపోయిన పరిస్థితులతో వేలాది రూపాయలు నష్టపోయాం అంటూ జి.మూలపొలం, ఎర్రగరువు ప్రాంతాల్లోని రైతులు అధికారుల ముందు తమ గోడును వ్యక్తంచేశారు. జిల్లావ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ సాగునీరు అందని పరిస్థితిపై ఇరిగేషన్‌శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో ముగ్గురు డీఈఈలు ఇన్‌చార్జులే కావడంతోపాటు ఆ శాఖలోని అధికారులు, సిబ్బంది మధ్య తలెత్తిన సమన్వయ లోపంతో నీటి సరఫరా జరగడంలేదనేది రైతుల ఆవేదన. ఈ నెల 18న నీటిసంఘాల ప్రతినిధులతో అమలాపురంలో ప్రాజెక్టు కమిటీ సమావేశం జరగనున్న నేపథ్యంలో అంశం ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తా కథనాన్ని అమరావతిలోని టీడీపీ కార్యాలయానికి పంపించడంతో దానిపై పార్టీ నాయకులను వివరణ కోరినట్టు తెలిసింది. సాగునీటి సమస్యపై మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా ఆరా తీశారని ఈ తరహా సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికార యంత్రాంగం స్పందించాలని సూచనలు జారీ చేసినట్టు సమాచారం. ఆంధ్రజ్యోతి వార్తాకథనం రైతుల సమస్యలను ప్రతిబింబింప చేయడంతో వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని జిల్లా తెలుగురైతు సంఘం అధ్యక్షుడు మట్టా మహాలక్ష్మిప్రభాకర్ అన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా
భూసమస్యల్ని పరిష్కరించాలి: జేసీ

అమలాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాల ఆర్థిక లబ్ధి అందించేలా భూయాజమాన్యాల భూములను విభజించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సర్వే సిబ్బందిని ఆదేశించారు. బుధవారం అమరావతి నుంచి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, భూ పరిపాలన కమిషనర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి, వీడియో కాన్ఫరెన్సు నిర్వహించగా జేసీ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో శ్మశాన వాటికల విస్తీర్ణాలను ఆరా తీసి ఎంత విస్తీర్ణం మేర ఉన్నాయో నివేదికలు సమర్పించాలన్నారు. అర్హులందరికీ ఇళ్లకు సంబంధించి లేఅవుట్లలో ఇప్పటివరకు లబ్ధిదారులకు పంపిణీ చేయని ఖాళీ జాగాలను గుర్తించి వాటిని అర్హుల అభీష్టానికి అనుగుణంగా పంపిణీ చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాల ఆర్థిక లబ్ధిని అర్హులందరికీ చేకూర్చే దిశగా భూసమస్యలపట్ల అధికారులు తక్షణమే స్పందించి అర్హులకు న్యాయం చేకూర్చాలన్నారు. జాయింట్ ఎల్పీఎం ఆన్‌లైన్ ప్రక్రియ, రీసర్వే పైలెట్ గ్రామాల పురోగతి తదితర అంశాలపై చర్చించారు. పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించిన గ్రామాల్లో అన్నిరకాల ఆన్‌లైన్ ప్రక్రియలు వీఆర్వో స్థాయి నుంచి నిర్వహిస్తూ నిర్దేశిత గడువు నాటికి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. రీసర్వేకు సంబంధించి నూరుశాతం నోటిఫికేషన్లు జారీ చేయాలన్నారు. రీసర్వే ప్రక్రియపై ఐవీఆర్ఎస్ ప్రజాభిప్రాయ పోర్టల్ ద్వారా ఎటువంటి అవినీతి ఆరోపణలు ఉత్పన్నం కాకుండా జవాబుదారీతనంతో సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కె.ప్రభాకర్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగుకు నీరివ్వకపోతే క్రాప్ హాలిడే ప్రకటిస్తాం

- అధికారులను నిలదీసిన రైతులు

ఐ.పోలవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సాగునీరివ్వకపోతే సార్వాకు హాలిడే ప్రకటిస్తామని రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. సాగునీటి ఇబ్బందులపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయశాఖల అధికారులు ఐ.పోలవరం మండలంలో పర్యటించారు. టి.కొత్తపల్లి, గుత్తెనదీవి, జి.వేమవరం, ఎర్రగరువు, మురమళ్ల, కొమరగిరిల్లో పర్యటించి నీటి ఎద్దడి పొలాలను పరిశీలించారు. జి.వేమవరంలో అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికి ఎకరాకు రూ.15వేలు పెట్టుబడి పెట్టామని, నీరివ్వకపోతే ఇక్కడితో విరమించుకుంటామని అన్నారు. ఈనెల 18న నీటిసంఘాల ప్రతినిధులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ విజయశ్రీ, ఇరిగేషన్ జేఈ ఈశ్వర్, వ్యవసాయాధికారిణి ఎం.వాణి వివరించారు. అధికారుల వెంట టి.కొత్తపల్లి నీటిసంఘం అధ్యక్షుడు చోడిశెట్టి నాగబాబు, ఐ.పోలవరం నీటి సంఘం అధ్యక్షుడు రాయపురెడ్డి స్వామినాయుడు ఉన్నారు.



జి.వేమవరంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

సంక్షేమ వసతిగృహాలు..
విద్యార్థుల భవిష్యత్తుకు సోపానాలుగా ఉండాలి

- హాస్టళ్ల సమస్యలపై వార్డెన్లతో సమీక్షించిన మంత్రి వీరాంజనేయస్వామి
- పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎంపీ హరీష్, ఎమ్మెల్యే ఆనందరావు



సమీక్షలో మంత్రి వీరాంజనేయస్వామి, ఎంపీ హరీష్, కలెక్టర్ మహేష్, ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల్లో చేరే పేద విద్యార్థుల భవిష్యత్తుకు సోపానాలుగా వసతిగృహాలను నిలపాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందని, నాణ్యమైన భోజనంతోపాటు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసింప చేయాలని సాంఘిక సంక్షేమశాఖ, విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమశాఖల మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సంక్షేమ వసతిగృహ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, బోధనా వసతులు వీరిపై మంత్రి సమీక్షించారు. వసతిగృహాల్లో ఖాళీల సంఖ్య, అద్దె భవనాలు, వార్డెన్ల ఖాళీల అంశాలపై మంత్రి సమీక్షించారు. విద్యను మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో అంకిత భావంతో అందించి హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు వార్డెన్లు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. కొన్ని హాస్టళ్లలో ప్రోటెన్షియల్ ఉన్నప్పటికీ సంక్షేమాధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రవేశాలు కల్పించే చొరవ తీసుకోవాలని సూచించారు. ఎక్కువగా ఖాళీలు పెట్టి వసతిగృహాలు నవడం కృష్టమన్నారు. జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల సమన్వయంతో సంక్షేమ అధికారులు పనిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. భవన భద్రత పారిశుధ్యం, పరిశుభ్రత, ఆహార నాణ్యత వంటి అవసరమైన సౌకర్యాలు, పడకలు, అధ్యయన బల్లలు, కుర్చీలు, సురక్షిత తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి అంశాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పది నుంచి ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 8,340 మంది విద్యార్థులకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఇన్సూరెన్సును ప్రవేశపెట్టామని, వసతిగృహాల్లో సంస్కరణలు అమలు చేస్తున్నామని చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థితికి ఎదగాలనే సీఎం చంద్రబాబు ఆశయానికి అనుగుణంగా ఆ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. శిక్షకులు ఎక్కువ మంది అవసరమైతే నియమించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. దోమల బెడద, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలుకు సంబంధించి పరిహారాల చెల్లింపు, పెండింగ్ అంశంపై సమీక్షించిన కలెక్టర్ రూ.60లక్షల పెండింగ్ బకాయిలను త్వరలో చెల్లిస్తామని మంత్రికి తెలిపారు. ఎంపీ గంటి హరీష్‌బాలయోగి మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల సమస్యలపై ఆయా పాఠశాలల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనకు చంద్రబాబు ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయిస్తుందని, వాటితో ఆయా పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కల్పిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో రాజకుమారి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి.జ్యోతిలక్ష్మీదేవితోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రవాణాశాఖ ఆదాయం లక్ష్యం రూ.127కోట్లు



- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- అర్హత కలిగిన ప్రతి విద్యార్థి లైసెన్సు పొందాలి
- జిల్లా రవాణాశాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాస్

మండపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రవాణశాఖ ద్వారా 2025-26 ఏడాదికి సంబంధించి రూ.127కోట్ల మేర ఆదాయం లక్ష్యంగా ఇచ్చారని, ఆ మేరకు చర్యలు చేపట్టామని జిల్లా రవాణశాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాస్ వెల్లడించారు. బుధవారం ఆయన మండపేట ఎంవీఐ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా విలేఖరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదాయ లక్ష్యాన్ని 40శాతం మేర చేరుకున్నామన్నారు. ఇప్పటివరకు రూ.40కోట్లమేర లక్ష్యం చేరుకున్నామన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ రహదారుల్లో ప్రమాదాల నివారణ వాహనాల తనిఖీల కోసం ప్రత్యేక చర్యలు టోల్‌గేట్‌ల వద్ద చేపట్టామన్నారు. జిల్లాలో 9మంది ఎంవీఐలు ఉన్నారన్నారు. వారికి ప్రతి నెలా రూ.5లక్షల మేర టార్గెట్ ఇచ్చామన్నారు. వాహన తనిఖీల ద్వారా ఆదాయం రాబట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో 2024-25వ ఏడాదిలో 2289 కేసులు నమోదు చేయగా వాటిద్వారా రూ.1.7కోట్ల మేర ఆదాయం చేకూరిందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ద్వారా వారంలో ఒక రోజు ట్రావెల్ బస్సుల్లో తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు స్పెషల్‌డ్రైవ్‌లో 193 వాహనాలపై కేసులు నమోదు చేసి వారి ద్వారా రూ.13.5లక్షల మేర అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. వాడపల్లిలో వాహనాల రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పోలీసు, రవాణశాఖ, ఆర్టీసీ సంయుక్త ఆధ్వర్యంలో ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు కార్యాచరణ చేపట్టామన్నారు. వాడపల్లికి లెక్కకు మించి ప్రయాణికులను తరలించే 20 ఆటోలపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఆటోలకు రూ.26,500 పెనాల్టీలు విధించామన్నారు.

జిల్లాలో ద్విచక్రవాహనాల ప్రమాదాల్లో యువత ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి విద్యార్థి డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని సూచించారు. ఇప్పటికే రోడ్డు ప్రమాదాలపై కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో ప్రతినెలా 200 కార్లు రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. 25వేల వరకు ద్విచక్రవాహనాలు రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయన్నారు. జిల్లాలో కార్ల షోరూంలు లేకపోవడంవల్ల ట్యాక్స్ రూపేణా జిల్లాకు రావాల్సిన ఆదాయానికి గండిపడుతోందన్నారు. జిల్లాలో కార్ల షోరూంలను ఏర్పాటు చేస్తే ఆదాయం ఇక్కడ వస్తుందన్నారు. అందుకు నిర్వాహకులు ముందుకు రావాల్సి ఉందన్నారు. మండపేట ఎంవీఐ లక్ష్మీదేవి పాల్గొన్నారు.



కాకినాడ సముద్ర తీరంలో ఉదయం పూట ఆకట్టుకుంటున్న సూర్యోదయం -(స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, కాకినాడ)



రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద సూర్యాస్తమయాన శివలింగం -(స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం)

'ఏలేరు' వెలవెల!


ఏలేరు జలాశయంలో కనిష్ఠ స్థాయిలో ఉన్న నీటి నిల్వలు

- ఏలేరు జలాశయంలో అంతంత మాత్రంగానే జలాలు
- ఖరీఫ్‌పై రైతుల ఆందోళన

ఏలేశ్వరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వర్షాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఏలేరు జలాశయంలో వర్షపు నీరు చేరలేదు. ఏలేరు ప్రాజెక్టులో తక్కువ జలాలు ఉండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షాలు రాకపోతే మెట్ట రైతులకు గడ్డుకాలం తప్పేదిలేదు. మెట్ట అవసరాలు తీర్చే ఏలేరు పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 86.56 మీటర్లకు 24.11 టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టులో 77.31మీటర్ల స్థాయిలో కేవలం 10.52 టీఎంసీలు జలాలే ఉన్నాయి. ప్రత్తిపాడు, పెద్దాపురం, పిఠాపురం నియోజక వర్గాల పరిధిలో 64 ఎకరాల ఖరీఫ్ సాగు ఇప్పటికే ప్రారంభమైంది. ప్రస్తుతం ఉన్న టీఎంసీల్లో నిబంధనల ప్రకారం ఆరు టీఎంసీలు ప్రాజెక్టులో ఉంచాలి. మిగతా టీఎంసీల నుంచి విశాఖ పారిశ్రామిక, తాగు నీరు, సాగు అవసరాలకు అందించాలి. నాలుగు టీఎంసీలు జలాలను వ్యవసాయం, విశాఖకు ఎలా సర్దుబాటు చేయాలనే ఆందోళన అధికారుల్లో ఉంది. ప్రస్తుతం సాగుకు 300క్యూసెక్కుల వంతున, ఎడమ కాలువ నుంచి విశాఖకు 150క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.

ఖరీఫ్‌పై అనుమానాలు

ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గడంతో ప్రస్తుత నీటి నిల్వలపై రాబోయే రోజుల్లో ఖరీఫ్ సాగుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతుల వారీ విధానంలో ప్రాజెక్టు నుంచి విడుదల చేసే నీరు నిర్ధారిత ఆయకట్టుకు చేరకపోవడమే రైతులకు ప్రధాన సమస్యగా మారింది. కాలువల ఆధునికీకరణకు నోచుకోక కాలువలు ఇప్పటికే అధ్వానంగా ఉన్నాయి. ప్రాజెక్టులో నీటి నిల్వను బట్టే ఆయకట్టులో సాగునీరు ఆధారపడి ఉంటుంది. అలాంటప్పుడు నీటి నిల్వలు తగ్గుదలతో రైతులు నిరాశకు గురవుతున్నారు.

విశాఖకు నీరు తరలింపు

ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో విశాఖకు నీటిని తరలిండంపై విమర్శలు వస్తున్నాయి. ప్రాజెక్టులో నీటిని మోటార్ల సహాయంతో పైపుల ద్వారా 150 క్యూసెక్కుల నీటిని తరలించడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, పశువులకు నీరు లేక అనేక ఇబ్బందులు పడుతుంటే విశాఖకు నీరు పంపించడంపట్ల పలు విమర్శలు వస్తున్నాయి.

ఇంజనీరింగ్ కళాశాలల్లో..
పరిశోధనలకు పెద్దపీట వేయాలి

- సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్
- జేఎన్‌టీయూకేలో యూసీఈకే ఓక్ ఉత్సవాలు ప్రారంభం



ఓక్ ఉత్సవాల్లో భాగంగా ఏడాదిపాటు చేపట్టే కార్యక్రమాల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కేకే అగర్వాల్

జేఎన్టీయూకే, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో 4నుంచి 5వేల వరకూ ఇంజనీరింగ్ కళాశాలలున్నా వాటిలో 100 కళాశాలలు కూడా చెప్పుకోదగినవి కాదని, అన్ని కళాశాలలు ఐఐటీ స్థాయికి చేరలేవు కానీ స్వయం ప్రతిపత్తితో సాంకేతిక విద్యలో నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతూ పరిశోధనలకు పెద్దపీట వేయాలని సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్ సూచించారు. కాకినాడ నగరంలో 1946లో ఏర్పాటైన ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల(యూసీఈకే) 2025, జూలై 16 నాటికి 79ఏళ్లు పూర్తి చేసుకుని 80వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఓక్ ఉత్సవాలు వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల ద్వారా ప్రజలకు యూసీఈకే కళాశాల ప్రతిష్టను తెలియజేయనున్నారు. ఏడాదిపాటు అనగా 2025, జూలై 16 నుంచి 2026, జూలై 15 వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా న్యూఢిల్లీలోని సౌత్ ఏషియన్ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే అగర్వాల్ ప్రారంభించగా గౌరవఅతిథిగా యూజీసీ మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ వేద్ ప్రకాష్, ప్రత్యేక అతిథులుగా పూర్వ విద్యార్థులు ఐఐటీ మద్రాస్ నుంచి సీఎస్ఈ ప్రొఫెసర్ డి.జానకిరాం, బెంగళూరులోని ఎక్స్ ఐఎంఈ పరిశోధనా విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.ఎం.కే భట్టా, ఇన్వెకాస్ ఛైర్మన్ దశరధ్ గుడే హాజరుకాగా జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా అగర్వాల్ మాట్లాడుతూ ఒకదేశం ప్రగతివైపు పయనించాలంటే సాంకేతికత వెన్నెముక అయి ఉండాలన్నారు. ఇంజనీరింగ్ విద్యలో ఇంకా పాఠ్యప్రణాళికలోను మార్పులు తీసుకురావాలని సూచించారు. ఓక్ వేడుకల్లో భాగంగా ఏడాదిపాటు నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికకు సంబంధించిన క్యాలెండర్‌ను అతిథులు ఆవిష్కరించారు. వేద్ ప్రకాష్ మాట్లాడుతూ గత 50ఏళ్లలో 47 యూనివర్సిటీలను కొలమానంగా తీసుకోగా మూడు విశ్వవిద్యాలయాలు మాత్రమే నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాయన్నారు. రష్యా, చైనా దేశాల మాదిరిగా ప్రగతి సాధించాలంటే సైన్స్‌ను బోధించడంలో ముందడుగు వేయాలని సూచించారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు పొందేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. 17, 18 తేదీల్లో రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ఇన్ స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్, రిజిస్ట్రార్, పలువురు డైరెక్టర్లు, మాజీ వీసీలు పాల్గొన్నారు.

ఆదివాసీలకు 100శాతం ఉద్యోగాల రిజర్వేషన్ కల్పనపై కసరత్తు

- గిరిజన సంక్షేమ సంచాలకులు భార్గవి



సదస్సులో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంచాలకులు ఎస్.భార్గవి

రంపచోడవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతాల్లోని ఉద్యోగాల్లో ఆదివాసీలకు వందశాతం రిజర్వేషన్ వర్తింపజేసేలా జీవో నెం.3లోని ఫలాలను పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని గిరిజన సంక్షేమ సంచాలకులు ఎస్.భార్గవి అన్నారు. రంపచోడవరం ఐటీడీఏలో బుధవారంనిర్వహించిన ఆదివాసీ వర్గాలు, మేధావుల సదస్సులో ఆమె మాట్లాడారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్‌కలెక్టరు కల్పశ్రీలతో కలిసి పలువురి అభిప్రాయాలను సేకరించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులతో రద్దయిన జీవో నెం.3ని పునరుద్ధరించాలంటూ జరిగిన ఉద్యమాలు, వినతుల నేపథ్యంలో ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోవాలన్న అంశంలో నిర్దేశిత ప్రొఫార్మాలో అభిప్రాయాలను తీసుకుంటున్నామని ఆమె అన్నారు. ప్రతి ఐటీడీఏ పరిధిలోను ఈ అభిప్రాయాలను తీసుకుంటున్నామన్నారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి సమర్పించి జీవో నెం.3 పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను ఖరారు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ సరైన రాజ్యాంగసవరణ ద్వారానే గిరిజన హక్కులు, రిజర్వేషన్లు పరిరక్షిస్తామన్నారు. ఆదివాసీ నాయకులు కంగల శ్రీనివాసరావు దొర, మిడియం శ్రీనివాసరావు, కొవ్వాసి శ్రీనివాసరావు, గొర్లె చిన్ననారాయణరావు, కత్తుల ఆదిరెడ్డి, మడి నెహ్రూ, వంతు బాలకృష్ణ, లోతా రామారావు, శరంకోట అబ్బాయిరెడ్డి, కింటుకూరి లక్ష్మణరావు, గిరిజన చట్టాల సలహాదారు, పి.త్రినాధరావు, న్యాయవాదులు కె.సత్యప్రసాద్, ఎ.నవీన్‌కుమార్, ఎం.రవితేజ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

కళాశాలలు ప్రతి విద్యా సంవత్సరం
అకడమిక్ ఆడిట్ నిర్వహించాలి

జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్


మాట్లాడుతున్న ప్రసాద్

జేఎన్టీయూకే, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ అనుబంధ కళాశాలలన్నీ ప్రతి విద్యా సంవత్సరం అకడమిక్ ఆడిట్ నిర్వహించాలని జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ సూచించారు. కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో వర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, కార్యదర్శులు, కరస్పాండెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కళాశాలల్లో నైపుణ్యతా ప్రమాణాలను పెంచేందుకు చేపట్టిన వినూత్న ఇనీషియేటివ్స్‌ను వివరించారు. సిలబస్, రెగ్యులేషన్స్ నవీనీకరణ, పరిశోధనలకు పెద్దపీట వేయడం, విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండే అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఓపెన్ లెర్నింగ్, ఓడీఎల్ కోర్సులను మూక్స్ విద్యా విధానాలను ప్రోత్సహిస్తున్నామని, విదేశీ విశ్వవిద్యాలయాలతో ఎంఓయూ ద్వారా మంచి బీటెక్, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మీట్, గ్రీట్ విత్ వీసీ కార్యక్రమంలో రెక్టార్ వీవీ సుబ్బారావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.


కేంద్ర సహాయ మంత్రి మాండవియాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎంపీ సతీష్‌బాబు

హాకీకి ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేయాలి

కేంద్ర సహాయ మంత్రికి రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు వినతి

కాకినాడ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన, క్రీడల శాఖ సహాయ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియాను ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు పాల్గొన్నారు. కాకినాడలో హాకీకి ప్రత్యేక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని మంత్రిని ఎంపీ సతీష్‌బాబు అభ్యర్థించగా ఈ ప్రతిపాదనను ఆమోదించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఈ సెంటర్ ఏర్పాటుచేస్తే జాతీయ క్రీడా పటంలో కాకినాడ స్థానం సంపాదించుకుంటుందని, యువతకు ప్రపంచ స్థాయి మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు.

1.62 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి...

ధవళేశ్వరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. బుధవారం సాయంత్రం కాటన్ బ్యారేజీ నుంచి మొత్తం 175 గేట్లను 30 మిల్లీమీటర్లపైకి ఎత్తి 1,62,092 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,600 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7వేల క్యూసెక్కుల చొప్పున సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద నీటిమట్టం మరింత తగ్గి బుధవారం సాయంత్రానికి 15.50 అడుగులకు చేరుకుంది.

యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

దివాన్‌చెరువు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా పీజీ డిప్లొమా ఇన్ యోగా, యోగా సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నన్నయ ప్రాంగణంతో పాటు కానవరంలోని శ్రీరాపర్తి యోగా సంస్థలో 50 సీట్ల చొప్పున వున్నాయన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 17 నుంచి వచ్చే నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆగస్టు 21న కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులు రూ.6వేలు, బయటివారు రూ.10వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడు నెలల యోగా సర్టిఫికెట్ కోర్సును నన్నయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని, దీనికి ఆగస్టు 25న కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఫీజు విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులకు రూ.1,500, బయటివారికి రూ.3వేలు కౌన్సెలింగ్ ప్రక్రియను విశ్వవిద్యాలయ డీవోఏ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ లేదా 73823 0 8440 నెంబరును సంప్రదించాలి.



బీర... బారెడు

ఈ బీరకాయలు బారెడు పొడవు ఉండి నిగనిగలాడిపోతున్నాయి. మీటరు బద్దంత పొడవు ఉన్న ఒక్కో బీరకాయ ధర కూడా బారెడే ఉంది. సీతానగరం గ్రామం నుంచి దిగుమతి చేసుకున్న బీరకాయలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. కిలో బరువున్న ఒక్కో బీరకాయ రిటైల్ మార్కెట్లో రూ.60 నుంచి రూ.80 పలుకుతోంది.

- అమలాపురం టౌన్ (ఆంధ్రజ్యోతి)

అడవుల సంరక్షణలో కీలక పాత్ర పోషించాలి

బీట్ అధికారుల స్నాతకోత్సవంలో ఏపీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే


శిక్షణలో ప్రతిభ చూపిన ఉద్యోగికి పతకం, సర్టిఫికెట్ అందజేస్తున్న శాంతిప్రియపాండే

దివాన్‌చెరువు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అడవుల పరిరక్షణ, నిర్వహణలో అటవీ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర అదనపు ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి (మానవవనరుల అభివృద్ధి, వన్యప్రాణులు) డాక్టర్ శాంతిప్రియపాండే అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీ ప్రాంగణంలో 12వ బ్యాచ్ అటవీ బీట్ అధికారుల స్నాతకోత్సవం అకాడమీ డైరెక్టర్ బి.విజయకుమార్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శాంతిప్రియ పాండే మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో అమలు చేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ అటవీ అకాడమీని గతంలో కంటే ప్రస్తుతం కొంత అభివృద్ధి చేశామని చెప్పారు. శిక్షణార్థులు జీవితంలోను, కెరీర్‌లోను మంచి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం దివాన్‌చెరువు వద్ద ఏర్పాటుచేసిన ఈ అటవీ అకాడమీలో ఇంతవరకు 500 మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుత బ్యాచ్‌లో 40 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారన్నారు. వీరంతా విధి నిర్వహణలో ఆదర్శంగాను, గేమ్ ఛేంజర్లుగాను నిలవాలని కోరారు. రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ ప్రకృతి సంపదను పరిరక్షించే అటవీ శాఖలో పనిచేయడం భగవంతుడు ఇచ్చిన గొప్పవరంగా భావించాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, ప్రతిభ చూపిన వారికి బంగారు పతకాలతో పాటు జ్ఞాపికలను శాంతిప్రియపాండే అందజేసి అభినందించారు. అంతకు ముందు జరిగిన పాసింగ్ పరేడ్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర పీసీసీఎఫ్ (హెచ్‌వోఎఫ్ఎఫ్) ఏకే నాయక్ శిక్షణార్థులనుద్దేశించి వర్చువల్ విధానంలో ప్రసంగించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ రామారావు, అటవీ శాఖ జిల్లా అధికారి వి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ గోదాముల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్యామ్‌కుమార్

ప్రభుత్వ గోదాములను సద్వినియోగం చేసుకోవాలి

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌కుమార్

కరప, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఉత్పత్తులను అయినకాడికి అమ్మి రైతులు నష్టపోతున్నారని, దీని నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణ సంస్థ (డబ్ల్యూడీఆర్ఏ)ను ఏర్పాటు చేసిందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. కాకినాడ జిల్లా కరప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో డబ్ల్యూడీఆర్ఏపై బుధవారం రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునే సమయంలో గిట్టుబాటు ధర లేక, నిల్వ ఉంచుకునే పరిస్థితి లేక, చేసిన అప్పులు, పెట్టుబడులకు డబ్బులు లేక అయినకాడికి అమ్ముకుంటున్నారన్నారు. ఈ పరిస్థితిని నివారించి అధిక ధర వచ్చినపుడు అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఎక్కడిక్కడ వేర్ హౌసింగ్ గోదాములను ఏర్పాటు చేసిందన్నారు. కరప మండలం నడకుదురులో ఉన్న గోదాములు ఇలా ఏర్పాటు చేసినవేనన్నారు. రైతులు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చేంతవరకు ఈ గోదాముల్లో నామమాత్ర రుసుముతో నిల్వ చేసుకోవచ్చన్నారు. ఇలా నిల్వ చేసిన సరుకుపై 80శాతం వరకు బ్యాంకులు తక్షణ రుణ సదుపాయం కల్పిస్తాయని చెప్పారు.

అనంతరం నడకుదురులోని గోదాముల వద్దకు రైతులను తీసుకెళ్లి వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులకు భోజన సదుపాయం ఏర్పాటుచేసి శిక్షణ కిట్లు, మెటీరియల్, రూ.300 చొప్పున స్టైఫండ్ పంపిణీ చేశారు. డీసీఏవో, ఇన్‌చార్జ్ డీఎల్‌సీవో పీపీఎంఎం కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్‌వీవీఎస్ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్, కోస్టల్ బ్యాంక్ విజయవాడ క్లస్టర్ హెడ్ వి.రవికుమార్, ఐసీఐసీఐ బ్యాంక్ రాజమహేంద్రవరం ఆర్ఎం ఎ.మురళీకృష్ణ, ఎన్ఈఆర్‌సీ అభిలాష్, సొసైటీ సీఈవో చందు, తమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీలకు
ముగిసిన శిక్షణ

సామర్లకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన మహిళా ఎంపీపీలు, జడ్పీటీసీలకు మూడు రోజుల జరిగిన శిక్షణ బుధవారం విజయవంతంగా ముగిసింది. సాయంత్రం వైస్ ప్రిన్సిపాల్ రమణ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ కేఎన్వీ ప్రసాదరావు శిక్షణార్థులకు సరిఫికెట్లు అందజేశారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకుని 'మార్పు ద్వారా విజేతలు' కార్యక్రమ లక్ష్యాలను నెరవేర్చాలని కోరారు. సభల నిర్వహణను వైకుంఠపాళీ ఆటగా నేర్పడం విశేషంగా ఆకట్టుకుంది. మహిళలు పాలకులైతే సమగ్ర అభివృద్ధి సాధ్యమన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం వారికి భాగస్వామ్యం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో డీడీవో శ్రీనివాసరావు, ఎంపీడీవోలు సుశీల, శర్మ పాల్గొన్నారు.


శిక్షణార్థికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు



వెల్లువగా వచ్చి విల్లులా మారి..

కాకినాడ నగరంలో బుధవారం సాయంత్రం కనిపించిన దృశ్యమిది.. ఆకాశంలో పక్షులు విల్లు ఆకారంలో ఎగురుతూ గుంపుగా సందడి చేశాయి. వెంటనే ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

మెనూ మారే!

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటకాల్లో మార్పులు

రాజమహేంద్రవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరుతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకూ ఉన్న మెనూ కాకుండా కొత్త మెనూ అమలు చేయనున్నారు. అయితే ఈ మెనూలో కొన్ని వంటకాలు పిల్లలు ఇష్టపడే విధంగా లేవని చెబుతున్నారు. ఉదాహరణకు శుక్రవారం పులిహోర, గోంగూర/ కాయగూరల పచ్చడి, ఉడికించిన గుడ్డు ఇవ్వాలని పేర్కొన్నారు. అన్నీ డ్రై వంటకాలు కావడంతో పిల్లలు తినడానికి ఇబ్బంది పడతారని, అరుగుదల నెమ్మదిస్తే కడుపు నొప్పి వంటివి వస్తాయని ఎండీఎం కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోజు	ఇప్పటివరకూ	ఇకపై మెనూ
సోమవారం	కూరగాయల కూర/ ఆకుకూరపప్పు, వేపిన గుడ్డు	ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు
మంగళవారం	పులిహోర/నిమ్మరైస్, గుడ్డు, పచ్చడి, రాగిజావ	గుడ్డు కూర, పప్పు, రసం, రాగిజావ
బుధవారం	కలగలుపు కూర, గుడ్డు	వెజ్ పులావ్, బంగాళా దుంప కుర్మా, ఉడికించిన గుడ్డు
గురువారం	అన్నం/పలావు, ఆలూ కుర్మా, గుడ్డు	సాంబారు, గుడ్డు కూర, రాగిజావ
శుక్రవారం	ఆకుకూర పప్పు, వేపిన గుడ్డు	పులిహోర, చట్నీ, గుడ్డు
శనివారం	కలగలుపు కూర, స్వీట్ పొంగల్	కలగలుపు కూర, రసం, రాగిజావ, స్వీట్ పొంగల్

గమనిక: రోజూ తెల్ల అన్నం మామూలే

వసతి గృహాల్లో పోస్టుల భర్తీకి జిల్లాలవారీగా సమీక్ష : మంత్రి డోలా



మాట్లాడుతున్న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ఉప్పలగుప్తం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న సంక్షేమ అధికారుల పోస్టులు భర్తీకి జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. వైసీపీ హయాంలో సౌకర్యాల లేమితో కునారిల్లిన వసతి గృహాలను చక్కదిద్దేందుకు పక్కా ప్రణాళిక ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి వివరించారు. బుధవారం కోనసీమ జిల్లా భీమనపల్లిలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ స్వగృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వసతి గృహాలు, గురుకులాలను సందర్శించి అక్కడి పరిస్థితులను అవగాహన చేసుకుంటున్నట్టు తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి ఆహారం, వసతి తదితర అంశాలపై అభిప్రాయాలను తెలుసుకుంటున్నట్టు వివరించారు. విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వంలో వసతుల కల్పన జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల విషయంలో కూటమి సర్కారు కచ్చితంగా వ్యవహరిస్తుందన్నారు. గతంలో ఉన్న నిబంధనల మేరకే నిధులు ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి, ఎస్సీఎస్టీలను వంచించిందని మంత్రి ఆరోపించారు. కార్యక్రమంలో భీమనపల్లి సొసైటీ చైర్మన్ ఆకేటి శ్రీనివాసరావు(పెద్ద), ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్ పాల్గొన్నారు.

'తల్లికి' ఆనందమేది!

- 40 విద్యుత్ సర్వీసులు ఉన్నట్టు తప్పుడు నివేదికలు
- ఒంటరి మహిళల బాధలు ● ఖాతాల్లో పడని డబ్బులు

సామర్లకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం పథకం పేరిట తల్లుల ఖాతాల్లో డబ్బులు వేసి ఆనందం నింపుతోంది. అయితే కొందరు తల్లులకు మాత్రం ఆ ఆనందం దక్కడంలేదు. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన కటకం నాగసత్య గంగా భవానికి ఇద్దరు చిన్నారులు. ఆమెకు తల్లికి వందనం మంజూరు కావాల్సి ఉన్నప్పటికీ ఆమె పేరిట 40 విద్యుత్ సర్వీసులు ఉన్నట్టు నివేదికలు చూపడంతో తీవ్ర ఆందోళన చెందింది. దీంతో సామర్లకోటలోని జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ అధికారుల వద్ద వివరణ కోరారు. దీంతో సదరు మహిళ పేరిట 40 సర్వీసులు ఉన్నట్టు చెప్పడంతో కనీసం సొంత ఇల్లు కూడా లేని తనకు విద్యుత్ సర్వీసులు ఎలా ఉంటాయని ఆమె ప్రశ్నించింది. అధికారులు చేసిన తప్పుడు నివేదికలను తొలగించేందుకు ఒక్కొక్క సర్వీసుకు రూ.35 చెల్లించి దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని అధికారులు చెప్పారు. దీంతో ఆమె తన పేరిట ఉన్న 40 సర్వీసుల తొలగింపు చర్యల నిమిత్తం రూ.1800 చెల్లించింది. జిల్లా ఉన్నతాధికారులు సత్వరం సమగ్ర దర్యాప్తు జరిపి తల్లికి వందనం పథకం తనకు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే తన ఇద్దరి పిల్లల చదువు అర్ధాంతరంగా ముగించాల్సి వస్తుందని గంగాభవాని వాపోయింది. కాగా ఈ విషయమై కాకినాడ జిల్లా కలెక్టర్‌కు నూతలపాటి అప్పలకొండ వినతి పత్రం అందజేశారు.



నాగ సత్య గంగా భవాని

ఫ్రీ సీటు మెలిక..

సర్పవరం జంక్షన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం వలసపాకల కృష్ణుడు గుడి వీధిలో నివాసం ఉంటున్న మల్లెల రాఘవకు కుమారుడు శ్రీహర్ష (9), సంగాని లోవలక్ష్మికి కుమారుడు శశివరుణ్(9) ఉన్నారు. ఆ మహిళల్ని భర్తలు విడిచిపెట్టి వెళ్లిపోయారు. దాంతో ఒంటరిగా ఉంటూ కాయకష్టం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. పిల్లలకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం కల్పించారు. శ్రీకాంత్ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతిలో చేరాడు. రెండో తరగతి భాష్యం స్కూల్లో చేర్పించారు. ఇక్కడ ఉచిత విద్యా సౌకర్యం లేకపోయినా 'తల్లికి వందనం' వస్తుందనే భరోసాతో తమ ఇళ్ల సమీపంలోని స్కూల్లో ఇద్దరు పిల్లలను చేర్పించినట్టు తల్లులు రాఘవ, లోవలక్ష్మి తెలిపారు. తమకు ఈ పథకం కింద డబ్బులు రాకపోవడంతో అధికారులను అడుగుతున్నా ఏ సమాచారం చెప్పట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు ప్రభుత్వం తరపున ఫ్రీ సీటు లభించడం, ఆన్‌లైన్‌లో ఇంకా ఉచితంగానే చదువుతున్నట్టు ఉండడంతో రూ.13వేలు రాలేదని అధికారులు చెప్పారన్నారు. ప్రభుత్వం ఒంటరి మహిళలకు ఇచ్చే వితంతు పింఛను కూడా అధికారులు తమకు ఇవ్వట్లేదని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



తల్లికి వందనం రాలేదని వాపోతున్న మల్లెల రాఘవ, సంగాని లోవలక్ష్మి

కోటసత్తెమ్మకు ఎమ్మెల్సీ సోము వీర్రాజు పూజలు



సోము వీర్రాజుకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

నిడదవోలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసిన కోటసత్తెమ్మ వారిని బుధవారం ఎమ్మెల్సీ సోము వీర్రాజు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్ స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం అనంతరం అమ్మవారిచిత్రపటం అందజేశారు.

సత్యదేవుడికి ఎస్పీ పూజలు



దర్శనానంతరం కాకినాడ ఎస్పీ కుటుంబం

అన్నవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం కాకినాడ జిల్లా ఎస్పీ జి.బింధుమాదవ్ కుటుంబసభ్యులతో స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామి ప్రసాదం అందజేశారు.

రేపు 'లోవ'లో ప్రత్యేక పూజలు

తునిరూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తలుపులమ్మ లోవ క్షేత్రంలో ఈనెల 18న ఆషాఢ మాస ఆఖరి శుక్రవారం ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయన ఈవో తెలిపారు. సామూహిక కుంకుమార్చనలో పాల్గొనే భక్తులకు పూజా ద్రవ్యములు, ఉచిత ప్రసాదం అందిస్తామని పేర్కొన్నారు.

ఆగస్టు 3న జాతీయ చెస్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న హైమావతి తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆగస్టు 3న ఓపెన్ జాతీయ చెస్ పోటీలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని టోర్నమెంట్ డైరెక్టర్ విత్తనాల హైమావతి తెలిపారు. ఈ మేరకు టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించి హైమావతి మాట్లాడుతూ ఆల్ ఇండియా ఇండిపెండెన్స్ టోర్నమెంట్ పేరుతో లోరియల్ హై గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో కాల్ ఫ్యూజన్ చెస్ అకాడమీ ఈ పోటీలను నిర్వహిస్తుందన్నారు. విజేతలకు రూ.1,23,456 నగదు బహుమతి అందజేయడం జరుగుతుందన్నారు. పోటీలకు దేశం నలుమూలల నుంచి సుమారు 400 మంది చెస్ క్రీడాకారులు వస్తారని భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సుంకర రవికుమార్, ప్రిన్సిపాల్ ఏక్తా, చెస్ అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన
ఎస్ఐ, కానిస్టేబుల్ కుటుంబాలకు ఆర్థిక సాయం



ఎస్ఐ అశోక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్ కుటుంబాలకు రూ.16.5లక్షల ఆర్థిక సాయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అందజేశారు. ఎమ్మెల్యే బండారు అభిమానులు సేకరించిన ఈ మొత్తంలో ఎస్ఐ అశోక్ కుటుంబానికి రూ.12లక్షలు, కానిస్టేబుల్ బ్లెసన్ కుటుంబానికి రూ.4.5లక్షలు అందించారు. ఎస్ఐ కుటుంబానికి రాజమండ్రిలో, కానిస్టేబుల్ కుటుంబానికి ఆలమూరులో ఎమ్మెల్యే బండారు చేతుల అందించారు. కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లి, భార్యకు గొడవలు...
నచ్చచెప్పలేక వ్యక్తి ఆత్మహత్య

కరప, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తరచుగా గొడవలాడుకుంటున్న కన్న తల్లి, కట్టుకున్న భార్యకు నచ్చచెప్పలేక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లికి చెందిన చోడిశెట్టి మణికంఠ(34)కు రెండేళ్ల క్రితం కీర్తనతో వివాహమైంది. వారికి చిన్నారి పాప ఉంది. తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న మణికంఠకు తల్లి, భార్య మధ్య గత ఆర్నెళ్లుగా జరుగుతున్న గొడవలతో మనశ్శాంతి కరువయ్యింది. ఎవరికీ నచ్చచెప్పలేని దుస్థితిలో జీవితంపై విరక్తి పెంచుకున్న మణికంఠ మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చేసి గడ్డి మందు తాగాడు. స్నేహితుడికి ఫోన్ చేసి విషయాన్ని చెప్పాడు. ఆపస్మారకస్థితిలో ఉన్న మణికంఠను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం బుధవారం మధ్యాహ్నం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కరప ఇన్‌చార్జి ఎస్ఐ ఆర్‌వీఎస్ మూర్తి కేసు నమోదు చేశారు.

బాలుడి అదృశ్యంపై కేసు



నాగేశ్వరరావు (ఫైల్)

రంగంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో బాలుడు అదృశ్యంపై బుధవారం కేసు నమోదు అయిందని ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం.. అల్లూరి సీ తారామరాజు జిల్లా గంగవరం మండలం రామవరం గ్రామానికి చెందిన కొంబర్లు నాగేశ్వరరావు (15) కుటుంబ సభ్యులతో కలిసి తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామం విశ్వజనని కోళ్ళ ఫారం నందు పనిచేసుకుంటున్నాడు. అయితే బాలుడు చిల్లరగా తిరుగుతున్నాడని అక్క తిట్టడంతో ఈనెల 14న ఉదయం 9 గంటలకు కోళ్ల ఫారం నుంచి వెళ్లిపోయాడు. అంతా వెతికినా కనిపించకపోవడంతో బావ మంగ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. బాలుడు ఆచూకీ తెలిస్తే రంగంపేట ఎస్ఐ 9440904854, అనపర్తి సీఐ 9440796538 నెంబర్లుకు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 40మందికి కాకినాడ 5వ ఏజేఎఫ్‌సిఎం మెజిస్ట్రేట్ ఎస్‌కె షరీన్ జైలు, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెపారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎస్.రమేష్, డి రామారావు సిబ్బందితో మంగళవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షించగా 40 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారిలో ఇద్దరికి 3 రోజుల చొప్పున జైలు శిక్ష, అలాగే మరో 8మందికి 2 రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 30 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.3,00,000 జరిమానా విధించినట్టు తెలిపారు.

హైకోర్టు తీర్పుతో.. పోలీసు బందోబస్తు నడుమ
డీసీఎంఎస్ స్థలం స్వాధీనం

పాత భవనాల తొలగింపు ప్రక్రియ ప్రారంభం



అమలాపురంలో స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న చైర్మన్ చంద్రమౌళి, మేనేజర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పు మేరకు పోలీసు బందోబస్తుతో కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ నడి బొడ్డున ఉన్న కోట్లాది రూపాయిల విలువైన స్థలాన్ని బుధవారం జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దశాబ్ద కాలానికి పైగా ఆ స్థలంలో అద్దెకు ఉంటున్నవారు కోర్టును ఆశ్రయించారు. చివరకు అద్దెకు ఉంటున్నవారు షాపులు ఖాళీ చేసి జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీకి అప్పగించాలని గతేడాది ఆగస్టు 19న హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఇటీవల డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పెచ్చెట్టి చంద్రమౌళి మార్కెటింగ్ సొసైటీ స్థలంపై ప్రధానంగా దృష్టి సారించారు. కోర్టు ఆదేశాల మేరకు బుధవారం డీసీఎం ఎస్ మేనేజర్ కొండేపూడి శ్రీనివాస్, సిబ్బందితో కలిసి స్థలం వద్దకు చేరుకున్నారు. పోలీసుల సహకారంతో స్థలాన్ని స్వాధీనం చేసుకుని భవనాల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. 44 సెంట్ల స్థలంలో ఉన్న భవనాలు, వృక్షాలు, చెత్తా చెదారం తొలగించి ఒక రూపు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టినట్టు డీసీఎంఎస్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. చైర్మన్ చంద్రమౌళి ఆదేశాల మేరకు ఈ స్థలంలో షాపింగ్‌మాల్ నిర్మాణం చేపట్టనున్నట్టు ప్రకించారు. డీసీఎంఎస్ ఉద్యోగులు, మంథ ఫణికుమార్ ఉన్నారు.

మోటారుసైకిల్ సైకిల్ ఢీకొని వృద్ధుడి మృతి



రామకృష్ణ (ఫైల్)

గండేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన శీలం రామకృష్ణ(54) బుధవారం మల్లేపల్లి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. రామకృష్ణ ఎక్స్‌ఎల్ మోటారు సైకిల్‌పై తన సొంతూరు బొర్రంపాలెం గ్రామం నుంచి ఫిల్టర్ మంచినీళ్ల కోసం వెళ్లి మల్లేపల్లి వచ్చి డివైడర్ దాటుతుండగా అదే మార్గంలో జగ్గంపేట వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న మోటారుసైకిల్ రామకృష్ణ మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి రామకృష్ణ మృతదేహాన్ని పెద్దాపురం పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శీలం రామకృష్ణకు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నారు.

మహిళను గాయపర్చిన నలుగురిపై కేసు

కొవ్వూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇటుక బొంతతో మహిళను గాయపర్చిన నలుగురు మహిళలపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ మహిళా హెచ్‌సీ.లలిత తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు శ్రీరామకాలనీకి చెందిన మాసా ఏసురత్నంతో అదే కాలనీకి చెందిన కల్లు శ్రీనమ్మ, మాసా మార్త, బీర అప్పాయమ్మ, బీర సంజన ఘర్షణపడి ఇటుకబొంతతో కొట్టి గాయపర్చారు. గాయపడిన ఏసురత్నం చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చేరింది. ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు ఏసురత్నం ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు మహిళా హెచ్‌సీ లలిత పేర్కొన్నారు.

డివైడర్ ఎక్కిన ట్రాక్టర్.. మరణించిన డ్రైవర్



హరీష్ (ఫైల్)

రాజానగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం జాతీయ రహదారిపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోట గ్రామానికి చెందిన పెనుమత్స హరీష్ (32) ఈతకోట నుంచి ట్రాక్టర్‌లో ఎరువుల బస్తాల లోడుతో శంఖవరం బయలుదేరాడు. మార్గమధ్యంలో గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి వచ్చే సరికి కళాశాల బస్సు ఒక్కసారిగా కళాశాలలోకి మళ్లించడంతో ట్రాక్టర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టర్ రోడ్డు డివైడర్ ఎక్కడంతో ట్రాక్టర్ డ్రైవర్ అదుపుతప్పి కింద పడిపోయాడు. ట్రాక్టర్ ట్రక్కు డ్రైవర్‌పై మీద నుంచి వెళ్లిపోవడంతో బలమైన గాయాలుకావడంతో జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనలు మేరకు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. రాజానగరం ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

అంబాజీపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇరుసుమండకు చెందిన తోట శ్రీనివాసరావు(58) ముక్కామలలో బొండాలు విక్రయిస్తుంటాడు. మంగళవారం రాత్రి ఖాళీ బొండాలు తీస్తున్న సమయంలో వాటిలో ఉన్న ఓ రక్తపింజరం పాము కాటు వేసింది. దీంతో అతడు మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

అటవీశాఖలో 700 ఉద్యోగాల నియామకానికి చర్యలు

దివాన్‌చెరువు వద్ద అటవీ అకాడమీ నూతన భవనానికి శంకుస్థాపన
రాష్ట్ర అదనపు ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి శాంతిప్రియ పాండే



శాంతిప్రియ పాండే

దివాన్‌చెరువు, జూలై16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అటవీశాఖలో ఖాళీగా ఉన్న 700 ఉద్యోగాల నియామకానికి సంబంధించి చర్యలు చేపట్టామని రాష్ట్ర అదనపు ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి (మానవ వనరులు, వన్య ప్రాణులు) డాక్టర్ శాంతిప్రియ పాండే తెలిపారు. ఈ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎస్సీ కేటగిరి, క్రీడా కోటాల వివరాలతో ఏపీ పీఎస్సీకి రాశామని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో బుధవారం తనను కలసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్రానికి దివాన్‌చెరువు వద్ద అటవీ అకాడమీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ అకాడమీలో ఎఫ్‌బీవోలు, ఎఫ్ఎస్‌వోలకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. అటవీశాఖలో ఇంకా 400 మంది ఉద్యోగులు శిక్షణ పొందవలసి ఉందన్నారు. దివాన్‌చెరువు వద్ద అటవీ అకాడమీ నూతన భవనానికి శంకుస్థాపన జరిగిందని, ఆ పనులను సీపీడబ్ల్యూడికి అప్పగించనున్నామని చెప్పారు. ఆరు నెలల్లో నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరం, మగటపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కోసం మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సంబంధిత శాఖ డీఈ రాంబాబు తెలిపారు. ఉదయం 8నుంచి 2గంటల వరకు మండలంలో సరఫరా ఉండదన్నారు.

సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి

అమలాపురం టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో చట్టబద్ధంగా కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని కోరుతూ న్యాయవాదులు బుధవారం అమలాపురంలో మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. మీడియేషన్ ఫర్ ది నేషన్ వారోత్సవాల ముగింపులో భాగంగా అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు ప్రాంగణం వద్ద నుంచి మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. అప్పీలు లేని శాశ్వత పరిష్కారం మధ్యవర్తిత్వంతో సాధ్యమని చెప్పారు. మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా ఆధ్వర్యంలో మీడియేషన్ ఫర్ నేషన్ అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం ముమ్మిడివరంలో మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు నుంచి రహదారి మీదుగా ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు.

గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

మంత్రి బాలవీరాంజనేయస్వామి




అల్లవరం: గోడిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే
ఉప్పలగుప్తం: భీమనపల్లి సొసైటీ చైర్మన్ ఆకేటి పెద్ద ప్రమాణ స్వీకారంలో మంత్రి, ఎమ్మెల్యే

అల్లవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థినీ, విద్యార్థులకు సరైన అహారం మోనూ ప్రకారం ఇవ్వాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. గోడి గ్రామంలో డాక్టర్ బీర్ అంబేడ్కర్ బాలురు, బాలికల గురుకుల కళాశాల, పాఠశాలలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలిసి మంత్రి సందర్శించారు. రూ.20లక్షలతో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం, బాస్కెట్‌బాల్ కోర్టు, రూ.15లక్షలతో ప్లే గ్రౌండ్ నిర్మాణానికి, బాలుర గురుకులలో రూ.24లక్షతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం, రూ.15లక్షలతో ప్లేగ్రౌండ్ నిర్మాణాలకు ఎమ్మెల్యే ఆనందరావుతో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. ప్యానల్ అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని, విద్యార్థుల పట్ల సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. గురుకుల కళాశాలల విద్యార్థులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో మాధవి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్ తోట శ్రీదేవి నరసింహారావు, తహశీల్దార్ వీవీఎల్ నరసింహం, ఎంపీటీసీ కాండ్రేగుల వాణీఅచ్యుతం, ప్రిన్సిపాల్స్ నక్కా శ్రీనివాస్, జి.వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు. గోడి గురుకుల కళాశాల అభివృద్ధికి సొంత నిధులు వెచ్చించిన క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజును మంత్రి సన్మానించారు.

రైతులకు మరింత సహకారం

ఉప్పలగుప్తం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత సహకారం అందేలా సొసైటీల అధ్యక్షులు కృషి చెయ్యాలని సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం భీమనపల్లి సొసైటీ అధ్యక్షుడిగా ఆకేటి శ్రీనివాసరావు(పెద్ద) ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైసీపీ పాలనలో సహకార సంఘాలు నిర్వీర్యమైనట్టు ఆయన ఆరోపించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో చైర్మన్‌తో పాటు పర్సన్లుగా సాకా రాజారావు, బి.గోపీకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు చైర్మన్ పెద్దను యువత ఆధ్వర్యంలో భట్లుపాలెం నుంచి భీమనపల్లి సొసైటీ వరకు మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా తీసుకు వచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, మెట్ల రమణబాబు, అల్లాడ స్వామినాయుడు, అరిగెల నానాజీ, ఆకేటి తాతాజీ, కంకటాల రామం, చీకట్ల నాని, మట్టపర్తి ధనరాజు, యాళ్ల సత్తిబాబు, మంచెం బాబి, సొసైటీ సీఈవో పోలిశెట్టి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'సుపరిపాలనకు' మంచి స్పందన

మలికిపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి ఎక్కడకు వెళ్లినా ప్రజల్లో మంచి స్పందన వస్తుందని టీడీపీ మహిళా ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి అన్నారు. బుధవారం మలికిపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. మలికిపురం గ్రామశాఖ అధ్యక్షుడు జంపన సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంగెన భూదేవి, అడబాల యుగంధర్, కాకి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సొసైటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

ఐ.పోలవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): కేశనకుర్రు సొసైటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం బుధవారం జరిగింది. చైర్మన్‌గా గాదిరాజు విశ్వనాధరాజు, పర్సన్లుగా సానబోయిన విజయభాస్కరరావు, మోకా సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు హాజరై పాలకవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర సత్యకుమారి, నీటిసంఘం డీసీ చిలువూరి సుబ్బరాజు, గాదిరాజు శ్రీనివాసరాజు, గాదిరాజు రామకృష్ణంరాజు, సలాది శేషారావు, ముదునూరి విజయరామరాజు, కలిదిండి అప్పలనరసింహరాజు, యనమదల ఆదినారాయణ పాల్గొన్నారు.



లంక గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే



పెదపూడిలంక స్కూల్లో స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): లంక గ్రామాలకు వారధి కల త్వరలోనే సహకారం కానుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. గంటిపెదపూడి, ఉడిమూడి పరిధిలోని నాలుగు లంకగ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించి అనంతరం మాట్లాడారు. బూరుగు లంక నదీపాయపై రూ.49.50కోట్లతో నిర్మితమవుతున్న వంతెన నిర్మాణం వచ్చే ఏడాదికి పూర్తి కానుందని చెప్పారు. ఇటీవల రూ.4కోట్లతో సీసీ రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. వంతెన పూర్తయిన అనంతరం మరిన్ని రహదారులు ఏర్పాటు చేసి వరదల్లో సైతం ఇబ్బందులు లేకుండా లంకగ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. తొలుత పెదపూడిలంకలో మండలపరిషత్ స్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఇటీవల ఏర్పాటుచేసిన మరుగుదొడ్లను పరిశీలించారు. ఉడిమూడిలంకలో పర్యటించి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని వృద్ధ మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐ బి.శివకృష్ణ, సర్పంచ్ ఎన్.ప్రసన్నకుమార్, దంగేటి అన్నవరం, ఎంపీటీసీలు ప్రియదర్శిని, పల్లి మోషే, కొమ్ముల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోరం లేక రాజోలు ఎంపీపీ ఎన్నిక వాయిదా

రాజోలు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాజోలు మండల ప్రజాపరిషత్ అధ్యక్షుని స్థానం ఖాళీ ఏర్పడినందున రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీపీ ఎన్నిక కోసం రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఎంపీపీ స్థానానికి కోరం లేక అధ్యక్షుని ఎన్నిక గురువారానికి వాయిదా పడింది. ఎన్నికల అబ్జర్వర్‌గా బీఎల్ఎన్ రాజకుమారి వ్యవహరించారు. ఈసందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంపీపీ ఎన్నిక బుధవారం 11నుంచి 12గంటల వరకు జరగాల్సి ఉందన్నారు. ఈఎన్నికకు వైసీపీకి చెందిన ఎంపీటీసీలు నలుగురు, ఇండి పెండెంట్‌కు చెందిన ఒక ఎంపిటీసీ మాత్రం హాజరయ్యారని తెలిపారు. ఏడు గురు నంబర్లతో కోరం పూర్తి అయినప్పుడే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ ఎన్నిక గురువారానికి వాయిదా వేశామని ఆమె తెలిపారు. ప్రిసైడింగ్ అధికారిగా పి.బొజ్జిరాజు వ్యవహరించారు.

దేవగుప్తం సొసైటీ చైర్మన్‌గా వెంకట్రాజు ప్రమాణ స్వీకారం

అల్లవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): దేవగుప్తం సహకార సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా బుధవారం నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు వేగిరాజు వెంకట్రాజు ప్రమాణ స్వీకారం చేశారు. దేవగుప్తం సొసైటీని జిల్లాలో మోడల్ సొసైటీగా అభివృద్ధి చేస్తానని వెంకట్రాజు అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు వెంకట్రాజును సన్మానించారు. గుబ్బల రాంప్రసాద్, గుబ్బల నాగేశ్వరరావు, జిన్నూరి రామారావు, కడలి వెంకటేశ్వరరావు, తిక్కా వెంకటప్రసాద్, సర్పంచ్ సాధనాల వెంకట్రావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల రాంబాబు, పోతుల నాగరాజు, మట్టా ప్రభాకర్, డీసీసీబీ డీఎం జి.ప్రియదర్శిని, బండిగుప్తాపు పాండురంగ, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, దాట్ల కృష్ణంరాజు, కంకిపాటి వీరబాబు, ఎన్.సుబ్బరాజు, కంకిపాటి గోపి, పోలిశెట్టి బాబులు, ముత్యాల బాబి, డైరెక్టర్లు నల్లా నాగరాజు, చిట్టూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులంతా సంఘటితం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బాపూజీ

ముమ్మిడివరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం కాశీభట్ల రామసూర్యనారాయణ సారథ్యంలో నడుస్తున్న ఈఏపీజీఈఏ ఉద్యోగులందరికీ అండగా ఉంటుందని జిల్లా శాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ పేర్కొన్నారు. ఓడీ ఇస్తూరాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 1331 విడుదల చేయడం పట్ల హర్షం ప్రకటించారు. జిల్లాలోని అన్ని తాలూకా యూనిట్ల కమిటీలను నెలాఖరులోగా పూర్తిచేసి ఆగస్టు మొదటి వారంలో వేలాది మంది ఉద్యోగులతో నిర్వహించే జిల్లా కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కోనసీమ జిల్లా ఆఫీస్ బ్యారర్స్, తాలూకా కమిటీ నాయకుల సమావేశం బుధవారం ముమ్మిడివరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద అసోసియేట్ అధ్యక్షుడు వీరబాబు అధ్యక్షతన నిర్వహించారు. తాత్కాలిక జిల్లా కమిటీ అధ్యక్షుడిగా మద్దాల బాపూజీ (రెవెన్యూశాఖ), జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.మల్లిబాబు(వైద్యఆరోగ్యశాఖ), జిల్లా కోశాధికారిగా రాజ్‌కుమార్ (ఎక్సైజ్), ఉపాధ్యక్షులుగా విజయ్ కుమార్, కొప్పిశెట్టి వెంకటగణేష్‌లను నియమించారు. కొత్తపేట తాలూకా కమిటీకి మద్దాల శ్రీనివాస్, కొప్పిశెట్టి గణేష్, ముమ్మిడివరం, తాలూకా కమిటీ ఏర్పాటుకు కె.మల్లిబాబు, శివ కుమార్‌లను ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నట్టు ప్రకటించారు. అన్ని ప్రభుత్వ శాఖల నుంచి సభ్యత్వాలు చేయించాలని, ఏపీజీఈఏ జిల్లాశాఖ కార్యాలయానికి రెవెన్యూశాఖ సహకారంతో ఐదు సెంట్ల భూమిని సేకరించి భవనం నిర్మించే అంశంపై చర్చించి నిర్ణయించారు.

బోర్డుపై పేరు మార్చండి



అల్లవరం మండలం గోడి బాలుర గురుకుల పాఠశాల బోర్డుపై జగనన్న గోరుముద్ద అని ఉండటాన్ని సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంగా మార్చాలని ఆదేశించారు.
అమలాపురం, (ఆంధ్రజ్యోతి)



ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

అంబాజీపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎరువుల షాపుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అంబాజీపేటలోని విజయలక్ష్మి ఎరువుల షాపులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీఏ ఎల్‌వీ మధు, సీఐ డీవీవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఎరువులు, పురుగు మందుల రిజిష్టర్లు, స్టాకు, పీఎంఎస్ మిషన్, గొడన్ తదితర రికార్డులను పరిశీలించారు. రికార్డుల ప్రకారం స్టాకు నిల్వలు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులపై ఆరా తీశారు. అలాగే కోనసీమ ప్రాంతంలోని పి.గన్నవరం, రావులపాలెం, ఆత్రేయపురం, లొల్లల్లో ఉన్న ఎరువుల షాపులను బుధవారం తనిఖీ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయాధికారి కె.ధర్మప్రసాద్, ఏఈవో జాబేదశాస్త్రి పాల్గొన్నారు.

మంత్రి వీరాంజనేయస్వామికి సన్మానం

అమలాపురం టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): అమలాపురం నియోజకవర్గానికి విచ్చేసిన సాంఘిక సంక్షేమశాఖ, విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో బుధవారం స్థానికకాటన్ అతిథిగృహం వద్ద స్వాగతం పలికారు. మంత్రిని సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్, అల్లాడ స్వామినాయుడు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌లకు రాయితీ

అమలాపురంటౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకునే లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.78వేలువరకు రాయితీ అందిస్తుందని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ పేర్కొన్నారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం వార్డు సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ డీఈఈ జి.అన్నవరం, మున్సిపల్ డీఈ కేవీవీ సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాణిసంయుక్త, ఏఈ కె.వెంకటేష్, గవర్నమెంట్ వెండర్ యల్లమిల్లి నాగసుధాకొండ, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఇన్‌చార్జి ఏపీఎంగా వెంకటరమణ

మామిడికుదురు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు మండల మహిళా సమాఖ్య ఇన్‌చార్జి ఏపీఎంగా వి.వెంకటరమణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పి.గన్నవరం మండలంలో సీసీగా పనిచేసిన ఆమెను ఇక్కడ ఇన్‌చార్జి ఏపీఎంగా నియమించారు. ఇక్కడ ఏపీఎంగా ఉన్న డి.వరాలబాబు బదిలీపై అమలాపురం డీఆర్డీఏ కార్యాలయానికి వెళ్లారు. నూతన ఏపీఎంకు మహిళా సమాఖ్య సభ్యులు, వీవోఏలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

మలికిపురం ఏపీఎంగా షేక్ సయ్యద్

మలికిపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండల సమాఖ్య ఏపీఎంగా షేక్ సయ్యద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. మహిళా సమాఖ్య సభ్యులు సయ్యద్‌ను అభినందించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆక్రమణల తొలగింపు

కాట్రేనికోన, జూలై 16(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన బస్‌షెల్టర్ వద్ద ఆక్రమణలు తొలగించాలన్న ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ బస్ షెల్టర్‌ను పరిశీలించి, ఆక్రమణలు తొలగించారు. అక్కడ బస్సుల రాకపోకల వేళల బోర్డు, హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేశారు. బస్‌షెల్టర్‌లో వ్యాపారులు టెండర్ నియమ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దింపు కార్మికులతో చర్చలు విఫలం

కాట్రేనికోన, జూలై16(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు, కందికుప్ప, దొంతికుర్రు పంచాయతీల పరిధిలో కొబ్బరి దింపు కార్మికుల వేతనఒప్పందం గడువు ముగిసి నాలుగు రోజులు కావడంతో కందికుప్ప రామాలయంలో బుధవారం రైతులు, కార్మికుల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. కాట్రేనికోనలో 100కాయలకు రూ200 ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. కాయకు రూ.1.75 కంటె ఎక్కువ ఇవ్వలేమని రైతులు అన్నారు. రూ.1.80ఇవ్వాలనికార్మికులు అన్నారు. రెండేళ్లకు ఒక సారి రేట్లు పెంచమంటే కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ వ్యాఖ్యానించారు. దీనితో చర్చలు విఫలమయ్యాయి. చర్చల్లో రైతుల పక్షాన యేడిద చక్రపాణిరావు, యేడిద సుబ్బారావు, తెలుగుదేశం చంటి, ఆకాశం బాబు, సలాది బాబ్జి, వరద సురేష్ నూకల బాబ్జి, యేడిద కన్నా, నూకల బెల్లంకొండ, కార్మిక నాయకులు విత్తనాల రాంబాబు, సింహాద్రి, కొడమంచిలి శ్రీను, వాసంశెట్టి ఏడుకొండలు, వెంకన్న, కుడుపూడి సత్తిబాబు, తాళ్ల మల్లిఖార్జునరావు, మచ్చా నాగేంద్ర పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో లాభం

అయినవిల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): రైతులు చిరుధాన్యాలు సాగు చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు ఆర్థిక లాభాలు పొందవచ్చునని శాస్త్రవేత్తలు సూచించారు. ఆచార్య ఎన్జీరంగా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అయినవిల్లిలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు, సేంద్రియ సాగు రైతులకు చిరుధాన్యాలు, వాటి ఆవశ్యకతపై శిక్షణ ఇచ్చారు. చిరు ధాన్యాలైన జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు గురించి వివరిస్తూ ప్రజలు తీసుకునే ఆహారంలో వీటిని ఒక భాగంగా చేసుకోవాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ కెన్నడీ, మండల వ్యవసాయాధికారి శోభ, రైతులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు, జూలై16(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామినిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరం వెంకటగిరికి చెందిన కొంపెల్ల అలివేలు కుటుంబ సభ్యులు బుధవారం రూ.లక్ష విరాళం అందించారు. వారికి ప్రసాదం అందించారు.

వాహనాల క్రయ, విక్రయాలకు మ్యాపింగ్ చేసుకోవాలి

అమలాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మ్యాపింగ్ ప్రక్రియ నూరు శాతం పూర్తి కాకపోవడంతో వాహనాల క్రయ, విక్రయ వ్యవహారాల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. వాహనాల క్రయ, విక్రయాలతో ప్రమేయం ఉన్న ఫైనాన్షియర్లు అందరూ రవాణాశాఖ ప్రస్తుత వాహన పోర్టల్‌లో మ్యాపింగ్ చేసుకోవాలని బుధవారం సూచించారు. ఇప్పటివరకు 70 శాతంఫైనాన్షియర్స్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందన్నారు. బ్యాంకుల పరిధిలో ఉన్న వాహనాలకు సంబంధించి మ్యాపింగ్ ప్రక్రియపై దృష్టి సారించామన్నారు.

విద్యా సంస్థల డ్రైవర్లకు అవగాహన

మలికిపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థులను జాగ్రత్తగా తీసుకువెళ్లి వారి ఇంటి వద్ద అప్పగించే వరకు బాధ్యత విద్యాసంస్థల యాజమాన్యాలదేనని ఎంఈవో ఎం.విజయశ్రీ, ఎస్‌ఐ పి.సురేష్ అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల డ్రైవర్లతో నిర్వహించిన సమావే శంలో వారు మాట్లాడారు. విద్యాశాఖ ఎంఈవో-2 పోలిశెట్టి గణేష్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం పాల్గొన్నారు.

నవోదయలో విద్యాలయ కమిటీ సమావేశం

యానాం, జూలై 16(ఆంధ్రజ్యోతి): యానాం శివారు మెట్టకుర్రులోని జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం మేనేజిమెంట్ కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. నవోదయ ప్రిన్సిపాల్ కీర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ చైర్మన్, పరిపాలనాధికారి మునిస్వామి, సభ్యులు హాజరయ్యారు. 2025-26 విద్యా సంవత్సరంలో తీసుకున్న చర్యలు తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని కమిటీ సభ్యులతో రుచిచూసిసంతృప్తి వ్యక్తంచేశారు. సభ్యులు డాక్టర్ టి.రవిశంకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కే. గంగవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పామర్రు, కే. గంగవరం, శివల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు, మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం ఏడీఏ కే. రత్నాలరావు, కే.గంగవరం ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదన్నారు. దీనికి సహకరించాలని కోరారు.

రూ.15 లక్షలతో పరిపాలనా భవనానికి మంత్రి శంకుస్థాపన

అమలాపురం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): నల్లమిల్లి అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే పరిపాలనా భవనానికి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే ఆనందరావుతో కలిసి అంబేడ్కర్ స్టడీ సర్కిల్ అభివృద్ధిపై చర్చించారు.

కపిలేశ్వరపురంలో చెత్త తొలగింపు పనులు


పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, సర్పంచ్

కపిలేశ్వరపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురం ఏటిగట్టు పుష్కర ఘాట్‌ను ఆనుకొని ఉన్న చెత్తను ఆ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు బుధవారం తొలగించారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో మోహన్ దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యదర్శి శివచక్రవర్తికి పనులపై పలు సూచనలు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఏటిగట్టుపై పేరుకుపోయిన చెత్తను పొక్లెయినర్, ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్, ఉపసర్పంచ్ బొక్కా రాంబాబు, కార్యదర్శి కే. శివచక్రవర్తి, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు'కు ప్రజాస్పందన భేష్ : ఎమ్మెల్యే


15వ వార్డులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

మండపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలుచేసిన పథకాలు, సంక్షేమంపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణంలోని 15వ వార్డులో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటా పర్యటించి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల గురించి వివరిస్తూ... సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గ్రంధి శ్రీనివాస్, మలసాని సీతారత్నం, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాద ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

మండపేట 'మున్సిపల్' సమావేశం

● పలు సమస్యలను లేవనెత్తిన కౌన్సిల్ సభ్యులు ● నోరువిప్పని అధికారులు


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం బుధవారం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగింది. ఇందులో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో వెనక వైపు ఉన్న మద్యం దుకాణాల నిర్వాహకులు మున్సిపల్ రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారని కౌన్సిల్‌లో సభ్యులు ధ్వజమెత్తారు. అలాగే రాజారత్నరోడ్డులోనూ మద్యం దుకాణం ఏర్పాటు వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని సభ్యులు పిల్లిశ్రీనివాస్, యారమాటి గంగరాజు ఆరోపించారు. అలాగే బంగారం దుకాణాల వద్ద కూడా వాహనాలు పెట్టిరోడ్డు ఆక్రమించేశారంటూ కౌన్సిలర్ చుంద్రు చినసుబ్బారావు ఆరోపించారు. ఆయా అంశాలపై అధికారులు సమాధానం చెప్పాలంటూ సభ్యులు డిమాండ్ చేయగా, సమాధానం చెప్పక మౌనం దాల్చారు. అనంతరం కౌన్సిల్‌కో ఆప్షన్‌సభ్యుడుగా పట్టణానికి చెందినషేక్ ఇబ్రహీం ఎన్నికైనట్టు ప్రకటించారు. ఇక పట్టణంలోని గొల్లపుంతకాలనీలో నిర్మించిన టిడ్కో గృహలును అర్హులకు అందిస్తామని కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. అవి కూడా ఖాళీలు వున్నవాటిని మాత్రమే ఇస్తామని ఆయన సభ్యులకు తెలిపారు. టిడ్కోగృహల వల్లే తాను ఎమ్మె ల్యేగా విజయం సాధించటం జరిగిందని ఎమ్మెల్యే వేగుళ్ల గుర్తుచేశారు. కొన్ని కారణాలు వల్ల టిడ్కో మూలంగా మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి చెందాల్సి వచ్చిందన్నారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ ఏ పార్టీ అధికారంలో వున్నప్పటికీ కూడా ప్యానల్ కమిటీ నుంచి చైర్మన్‌గా అవకాశం ఇవ్వటం ఆనవాయితీగా వస్తుందని, దాన్ని అలాగే కొనసాగించాలని ఎమ్మెల్యే వేగుళ్ల, కో ఆప్షన్ సభ్యుడు రెడ్డిరాధాకృష్ణ కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడూతూ చైర్‌పర్సన్ పట్టణంలో లేని సమయంలో అవకాశం దక్కుతుందన్నారు. దీనిపై కమిషనర్‌నుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కమిషనర్ ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు చేయటంలో దిట్టంటూ చురకలు వేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్యబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్, శానిటరీ అధికారికి సత్కారం


కమిషనర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, కౌన్సిల్ సభ్యులు

మండపేట, జూలై16 (ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణం శానిటేషన్ నిర్వహణ, పరిపాలనా పరమైన అంశాలలో రాష్ట్ర స్థాయిలో రెండోస్థానం గుర్తింపు పొందిన నేపథ్యంలో కమిషనర్ టీవీ రంగారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాలసత్తి రాజును బుధవారం స్థానిక కౌన్సిల్ హాల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, చైర్‌పర్సన్ రాణి, కౌన్సిలర్లతోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, తదితరులు సత్కరించారు.

కమ్మ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మండపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): కమ్మ విద్యార్థులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు మండపేటలో వున్న రెడ్డి వెంకయ్య సంఘం ఉపకార వేతనాలు అందించేందుకు నిర్ణయించినదని ఆ సంఘం అధ్యక్షుడు రెడ్డి రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు మండపేటలో బుధవారం సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్‌లోకి వెళ్లిన విద్యార్థులు మండపేటకు చెందినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94907 10804 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఉపకార వేతనాలకు సంబంధించిన బ్రోచర్‌ను సంఘీయులు ఆవిష్కరించారు.

గుర్తింపు కోసమే ... టీడీపీపై ఆరోపణలు

● పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వీర్రాజు

రాయవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చెల్లూరు వైసీపీ గ్రామ శాఖ అధ్యక్షుడిని అని చెప్పుకునే చోడే వెంకట రమణ అసలా పదవిలో ఉన్నారా? ఉంటే ఇన్ని రోజులు ఎక్కడ దాక్కున్నారు. ఇలా కూటమి పాలనపై అవాకులు చవాకులు మాట్లాడితే గుర్తింపు వస్తుందని భావిస్తున్నారా అని చెల్లూరు టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు (రాజు) ప్రశ్నించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నేను నిక్కర్లు వేసుకుని తిరిగే రోజుల్లో ప్రస్తుత వైసీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు అని చెప్పుకునే చోడే వెంకట రమణ రాజకీయాల్లో ఉన్నానని చెప్పిన మీరు, నాకు వైసీపీలో గుర్తింపు లేదని, మీ పార్టీలోకి వస్తానని ఆ నిక్కర్లు వేసుకున్న వ్యక్తి చుట్టూ తిరిగిన రోజులు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇకనైనా కూటమి ప్రభుత్వంపై అవాకులు చవాకులు మాని గ్రామాభివృద్ధికి సహకరించాలనివీర్రాజు కోరారు.

మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడిగా ఇబ్రహీం


ఇబ్రహీంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, మైనార్టీ సంఘ నాయకులు

మండపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) మండపేట మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్‌సభ్యుడిగా టీడీపీకి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్‌ఇబ్రహీం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు దీనికి సహకరించిన ఎమ్మెల్యే వేగుళ్లను బుధవారం పట్టణ మైనార్టీ సంఘ నాయకులతో ఇబ్రహీం వెళ్లి కలిశారు. ఈసందర్భంగా ఇబ్రహీంను ఎమ్మెల్యే వేగుళ్ల, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, తదితరులు అభినందించారు. తనకు పదవి ఇచ్చినందుకు వారికి ఇబ్రహీం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఖరీంఖాదరి, ఎండీ అవుతార్ రెహమాన్, అల్తాఫ్, సలీ, గడి రాంబాబు. సూర్రావు, తదితులు పాల్గొన్నారు.

కేశవరం, సోమేశ్వరం, లొల్లలో 'పొలం పిలుస్తోంది'


కేశవరంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మండపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో కే. ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి రైతులు హాజరయ్యారు. వారానికి రెండురోజుల పాటు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఏవో తెలిపారు. రైతుల్లో వ్యవసాయానికి పెట్టుబడి తగ్గించటమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు శ్రీను, ఉండమట్ల సురేష్, గ్రామ విస్తరణాధికారి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: సోమేశ్వరం, లొల్లలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాలను నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి కేవీఎస్ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల విక్రయాలకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం పలువురు మాట్లాడారు. వ్యవసాయ శాఖలో బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది బదిలీల ప్రక్రియలో ఉన్నందున రైతులు సహకరించాలని ఆయన కోరారు.

రాజధానిలో భూమి కేటాయింపుపై హర్షం

కె.గంగవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహం, స్మృతి వనం ఏర్పాటుకు భూమి కేటాయించడంపై ఆర్యవైశ్యసంఘం నాయకులు హర్షం ప్రకటించారు. మెమోరియల్ ట్రస్టుకు శాఖమూరు పార్కులో 6.8 ఎకరాలు స్థలాన్ని సీఆర్‌డీఏ కేటాయించింది. దీనికి సంబంధించిన పత్రాలను సీఎం ఆదేశాలతో మంత్రి నారాయణ ట్రస్టు అధ్యక్షుడు డూండీ రాకేష్‌కు అందజేశారు. దీనిపై కోనసీమ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు మాటూరి వెంకటేశ్వరరావు (నాని), కే. గంగవరం మండల అధ్యక్షుడు చిన్ని రామ్‌ప్రసాద్, కార్యదర్శి పావులూరి సూర్యప్రకాష్, నాళం వెంకన్నబాబు, మాటూరి శ్రీనివాసులు హర్షం ప్రకటించారు.

కూళ్ల వాటర్ 'డిస్ట్రిబ్యూటర్' చైర్మన్ శివప్రసాద్ మృతి

కపిలేశ్వరపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కూళ్ల వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మేకా శివప్రసాద్ (50) బుధవారం మృతిచెందారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన గాయపడడంతో అత్యవసర చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. కపిలేశ్వరపురం మండలం తాతపూడికి చెందిన ఈయన తాతపూడి నీటిసంఘం అధ్యక్షుడిగా, కూళ్ల డీసీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన మృతిపై పలువురు కూటమి నాయకులు, గ్రామస్థులు, తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు పట్టు పరికిణీల బహూకరణ


విద్యార్థులకు అందజేస్తున్న నాగమోహన్‌రావు, తదితరులు

కె.గంగవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పామర్రు ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన ఏడుగురు విద్యార్థినులకు బుధవారం పట్టు పరికిణీలు బహూకరించారు. గ్రామానికి చెందిన కుడుపూడి నాగ మోహన్‌రావు ఉన్నత స్థానంలో ఉద్యోగిగా ఉన్నారు. ప్రస్తుతం గ్రామానికి వచ్చిన ఆయన పామర్రు ఆటస్థలంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, ఎస్‌ఐ ఎస్‌కే జానీబాషా, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చుండ్రు వీరవెంకట సత్యనారాయణ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ క్షతగాత్రుడి మృతి

రాజానగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన ఎం.కృష్ణమూర్తి (30) ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు తెల్పిన వివరాలివి. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తూ ఉంటాడు. ఈనెల 14న తమ స్వగ్రామం కేశవరం వచ్చి సాయంత్రం షాపింగ్‌కి రాజమండ్రి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పుణ్యక్షేత్రం దాటిన తర్వాత జి.ఎర్రంపాలెం చెరువుగట్టు వద్ద బండిస్కిడ్ అయ్యి పడిపోయాడు. సమాచారం అందుకున్న బంధువులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడని పోలీస్‌లు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం

● మంత్రి వాసంశెట్టి సుభాష్


త్రిసభ్యకమిటీ చైర్మన్ గణేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న మంత్రి సుభాష్, ఎంపీ హరీష్

ద్రాక్షారామ, జూలై16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి సంఘాలకు పూర్వవైభవం తీసుకువస్తామని మంత్రి సుభాష్ అన్నారు. బుధవారం ద్రాక్షారామ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ముప్పనపల్లి గణేష్, సభ్యుల ప్రమాణ స్వీకారమహోత్సవంలో మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సహకార సంఘాల పనితీరు మరుగునపడిపోయిందన్నారు. రైతుల సంక్షేమం, వారి ఆర్థిక పరిపుష్టికి సహకార సంఘాలు దోహదపడతాయన్నారు. కూటమి ప్రభుత్వం అన్నివ్యవస్థలను పునరుజ్జీవం చేస్తుందన్నారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో రూ.48,402 కోట్లు కేటాయించిందన్నారు. త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నేరుగా సొమ్ము జమచేస్తామన్నారు. ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ పీఏసీఎస్‌ల పనితీరు మెరుగుపరచడం ద్వారా అన్నదాతలకు మేలు జరుగుతుందన్నారు. ద్రాక్షారామ పీఏసీఎస్ త్రిసభ్యకమిటీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన ముప్పనపల్లి గణేష్, సభ్యులు అల్లం రామకృష్ణ, అల్లకమల్లి ఖార్జునరావులను మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్‌లు అభినందించారు. కాగా పీఏసీఎస్ త్రిసభ్యకమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి జనసేన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు రాయపురెడ్డి రాజా, వాసంశెట్టి సత్యం, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, పెంకె సాంబశివరావు, తోటరాము, రేవు శ్రీను, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు కర్రి చిట్టిబాబు, దామిశెట్టి వీర వెంకట చంద్రశేఖర్ అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో పెంకె సత్యనారాయణ, సిబ్బంది, రైతులుపాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం కొత్త సభ్యులకు రూ 21.86 లక్షలు రుణాలు చైర్మన్ గణేష్ అందజేశారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

కందులపాలెం పీఏసీఎస్ త్రిసభ్యకమిటీ ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. త్రిసభ్యకమిటీ చైర్మన్‌గా వైట్ల శ్రీనివాసరావు అలియాస్ రాజబాబు, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం హాజరయ్యారు. చైర్మన్ రాజబాబు, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో వైట్ల గజలక్ష్మీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకమే కూటమి ప్రభుత్వ బలం

● ఎమ్మెల్యే బండారు సత్యానందరావు


ర్యాలిలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తనయుడు సంజీవ్

ఆలమూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ప్రభుత్వంపై అపారమైన నమ్మకం ఉంచి కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చారని వారి నమ్మకంతోనే ఏడాదిలోనే అనేక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని వారి నమ్మకమే కూటమి ప్రభుత్వం బలమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం చింతలూరు, సూర్యారావుపేట గ్రామాలలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఏడాదిపాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈదల సత్తిబాబు, దండంగి మమత, వైట్ల గంగరాజు, వైట్ల శేషుబాబు, అల్లంరాజు రామకృష్ణమూర్తి, గన్ని చిన్నబ్బు, వాకా సుబ్బలక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఆత్రేయపురం: కూటమి ఏడాది పాలనలో స ంక్షేమం అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ మ్యా నిఫెస్టో పథకాలను అమలు చేసినట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ తెలిపారు. బుధవారం ర్యాలి గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయ న పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, మద్దూరి సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పెండెం వెంకన్న, మండ ల పార్టీ ప్రధాన కార్యదర్శి గుడెలా నాగేంద్ర, మెర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.4.10 లక్షలు


స్వామివారి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూలై16(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవలద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,10,955 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఆకివీడుకు చెందిన కొల్లి వెంకటేశ్వర బాబు, వెంకటలక్ష్మి దంపతులు రూ.50వేలు విరాళం సమర్పించారు. దాతలకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

భక్తుల రద్దీకి దీటుగా సౌకర్యాల ఏర్పాటు

ప్రతి శనివారం వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో సౌకర్యాలు పెంపుదలకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన అనంతరం బుధవారం ఉపకమిషనరు, ఈవో సూర్యచక్రధరరావు చర్యలు చేపట్టారు.

గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్‌గజపతిరాజుకు అభినందనలు


అశోకగజపతిరాజును కలిసి అభినందనలు తెలిపిన ఈవో సురేష్‌బాబు, సిబ్బంది

కొత్తపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్‌గజపతిరాజును బుధవారం విజయనగరం బంగ్లా నందుమందేశ్వర(శనేశ్వర)స్వామివారి దేవస్థానం ఆలయ సహాయ కమిషనరు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజును సురేష్‌బాబు దుశ్శాలువాతో సత్కరించారు. అశోక్ గజపతిరాజు మందపల్లి శనేశ్వరస్వామి ఆలయ ఫౌండర్ ట్రస్టీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులపై అలసత్వం

● పీడీఎస్‌యూ నిరసన

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై16 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయకార్యదర్శి బి.సిద్దూ అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల ఫీజుల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతోకూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ ఏవోకు అందజేశా రు.

జిల్లాస్థాయి టోర్నమెంట్ విజేతకు షీల్డ్ అందజేత

ఆత్రేయపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. బుధవారం ర్యాలి జడ్పీ హైస్కూల్‌లో జిల్లా లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతగా తణుకు సన్ని టీమ్ నిలిచింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ ఫైనల్ మ్యాచ్ విజేతకు షీల్డ్ అందజేశారు. ఫైనల్ మ్యాచ్ విజేత తణుకు సన్నిటీమ్‌కు షీల్డ్‌తోపాటు రూ.50వేల నగదు బహుమతిని అందించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, మాజీ సమితి అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పెండెం వెంకన్న పాల్గొన్నారు.

రాజీమార్గమే.. రాజమార్గం

● న్యాయవాదుల ర్యాలీ


ప్రదర్శనను ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

రామచంద్రపురం(ద్రాక్షారామ),జూలై16(ఆంధ్రజ్యోతి):రాజీమార్గమే.. రాజమార్గమని సీనియర్ సివిల్‌జడ్జి, లోక్‌అదాలత్ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రామచంద్రపురం పట్టణంలో మండల లీగల్‌సెల్ ఆధ్వర్యం లో మధ్యవర్తిత్వం మేలు అంటూ న్యాయ వాదులు మోటారు సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని లోక్‌అదాలత్ చైర్మన్, సీనియర్‌సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. రాజీ చేయదగ్గ కేసుల్లో కక్షిదారులు పట్టుదలకు పోకుండా మంచిఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ లకాని పద్మ కమలకుమారి, బార్ అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు వరహానరసింహమూర్తి, స్పోర్ట్స్ సెక్రటరీ సాదే నారాయణరావు, మాజీ ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యా యవాదులు దొమ్మలపాటి సత్యనారాయణ, కేవీ సత్యవాణి, బండి శ్రీనివాస్, సన్నపు బాల సుబ్రహ్మణ్య కుమారస్వామి, సీనియర్ న్యాయవాదులు ఆర్.ఆర్.కె, పి.జానకి, నీలం మదుసూధనరావు, కటకం అభిరామ్, పిల్లా పృధ్వి పాల్గొన్నారు.

స్టూడెంట్స్ రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి



ఆత్రేయపురం, జూలై16 (ఆంధ్రజ్యోతి): స్టూడెంట్స్ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆత్రేయపురం, ఉచ్చిలి, పులిదిండి, వెలిచేరు, పేరవరం, రాజవరం, బొబ్బర్లంక గ్రామాల నుంచి ప్రతి రోజు విద్యార్థులు రాజమహేంద్రవరంలోని కళాశాలలకు సుమారు 200మందిపైనే ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. రావులపాలెం నుంచి ఆత్రేయపురం బొబ్బర్లంక మీదుగా రాజమహేంద్రవరం వెళ్లేందుకు విద్యార్థులు గత కొంతకాలం నుంచి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బడిబస్సు ఈ రూట్‌లో నడిపేవారు. ఏడాది నుంచి ఈ బస్సులు రద్దు చేశారు. రావులపాలెం ఉదయం బయలుదేరే 7గంటలు, 8గంటల బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోవడంతో విద్యార్థులు ఈ బస్సులో ఎక్కడానికి దారిలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రూట్ సర్వీసులో బడిబస్సును పునరుద్ధరించాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడకపోవడంతో విద్యార్థులు నిర్ణిత సమయానికి స్కూల్స్ కాలేజీలకు వెళ్లలేకపోతున్నారు. శనివారం అయితే వాడపల్లి వెంకన్న ఆలయానికి రావులపాలెం డిపో నుంచి బస్సులు ఎక్కువ నడపడంతో బొబ్బర్లంక మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే బస్సు సర్వీసులను రద్దు చేయడంతో విద్యార్థుల అవస్థలు వర్ణణాతీతం. విద్యార్థుల ఇక్కట్లు, పరిగణలోకి తీసుకుని బడి బస్సును ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

'మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి'


మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాలలోను రాణిస్తూ ముందంజలో ఉంటున్నారని ఆర్థికంగా బలోపేతంపై ప్రతీ ఒక్కరూ ఆమేరకు కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం గుమ్మిలేరులో ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన 30 కుట్టుమిషన్లను బుధవారం ఎమ్మెల్యే బండారు మహిళలకు అందించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, సర్పంచ్ గుణ్ణం రాంబాబు, నాయకులు వంక అన్నవరం, ఈదల వీర్రాజు, యాదగని సతీష్, ముత్యాల భాస్కరరావు, ఓఎన్జీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

● కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్


సదస్సులో మాట్లాడుతూ డీఎస్పీ మురళీమోహన్

ఆలమూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాల పట్ల విద్యార్థి దశ నుంచి అవగాహన పెంచుకోవాలని కొత్తపేట డీఎస్పీ సుంకర్ మురళీమోహన్ అన్నారు. ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో మహిళా సంరక్షణ అనే అంశంపై రావులపాలెంరూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. మీబంగారు భవిష్యత్ కోసం మీతల్లిదండ్రులు ఎంతో కష్టపడి స్కూల్స్‌కు పంపిస్తున్నారని వారి కలలను నిజంచేయడానికి కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బందితోపాటు సిద్దార్థస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

రావులపాలెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత సహకరించకపోవడంతో ఓ బాధితుడికి అక్షయ సేవా సంస్థ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. రావులపాలానికి చెందిన బండారు శ్రీను షుగర్ కారణంగా కాలు తీవ్ర ఇబ్బందులకు గురైంది. దీంతో వైద్యులు ఆసుపత్రిలో జాయిన్ అయ్యి వైద్యం చేయించుకోవాలని సూచించారు. దీంతో సంస్థ సభ్యులు 26వేల రూపాయలను వైద్య ఖర్చుల నిమిత్తం బండారు శ్రీనుకు అందజేశారు.